# ప్రజా మంటలు

తెలంగాణ జాతీయ దినపత్రిక

ఎడిటర్ : సిహెచ్.వి. ప్రభాకర్ రావు






ప్రచురణ : జగిత్యాల సంపుటి : 05 సంచిక : 346 పేజిలు : 04 వెల రూ. 2 బుధవారం 29 - 07 - 2026


## ప్రతి సంవత్సరం
# ఫీజు రీఎంబర్స్‌మెంట్ చెల్లిస్తాం

- తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- ఢిల్లీ పర్యటనలో సీఎం రేవంత్ రెడ్డి
- మీడియాతో మాట్లాడిన సీఎం
- యూనివర్సిటీలపై ఆధిపత్యం చలాయించాలని కేంద్రం యత్నిస్తోందని ఆరోపణ
- కేంద్ర చట్టాల మేరకు రాష్ట్రంలో ప్రక్షాళనపై యోచిస్తామని వెల్లడి



**హైదరాబాద్ :** ఢిల్లీ పర్యటనలో ఉన్న సీఎం రేవంత్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ,, ఆఫ్‌లైన్‌లో పరీక్షల నిర్వహణ వల్ల సమస్యలు ఎక్కువ వస్తున్నాయని తెలిపారు. బాధ్యులైన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. విద్యాశాఖలో రాష్ట్ర పరిధి అధికారాలను కేంద్రం లాక్కునే ప్రయత్నం చేస్తోందని, యూనివర్సిటీలపై ఆధిపత్యం చలాయించాలని కేంద్రం యత్నిస్తోందని ఆరోపించారు. విద్య, వీలైనంత వరకు రాష్ట్ర పరిధిలో ఉంటే తప్పిదాలు జరగకుండా ఉంటాయని తెలిపారు.కేంద్ర చట్టాల మేరకు రాష్ట్రంలో ప్రక్షాళనపై ఆలోచిస్తామని సీఎం తెలిపారు. పబ్లిక్ సర్వీస్ కమిషన్ ప్రక్షాళన చేసి నియామకాలు చేపట్టామని, రాష్ట్రంలో పారదర్శకంగా పరీక్షలు నిర్వహించామని గుర్తు చేశారు. విద్యార్థులకు నమ్మకం కలిగించేలా ప్రభుత్వం పరీక్షలు నిర్వహిస్తోందని, గ్లోబరీనా వంటి సంస్థలు నాడు తెలంగాణలో అక్రమాలకు పాల్పడ్డాయని, నాటి ప్రభుత్వం చర్యలు తీసుకోకపోవడం వల్ల సీబీఎస్ఈకి విస్తరించారని, - మిగతా 2 లో



## శివరాజ్ సింగ్ చౌహాన్‌తో
# రేవంత్ రెడ్డి భేటీ

- 11.56 లక్షల ఇళ్లను కేటాయించాలని విన్నపం
- గత ప్రభుత్వ హయాంలో గృహనిర్మాణ రంగం నిర్లక్ష్యానికి గురైందని కేంద్ర మంత్రికి తెలిపిన రేవంత్
- ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను ఉపాధి హామీ జాబితాలో చేర్చాలని విన్నపం
- గ్రామీణ కుటుంబాలను ఆదుకునేందుకు ఉపాధి హామీ పథకాన్ని విస్తరించాలన్న సీఎం

**హైదరాబాద్ :** ఢిల్లీ పర్యటనలో ఉన్న తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేంద్ర వ్యవసాయ, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌తో ప్రత్యేకంగా - మిగతా 2 లో

## తెలంగాణలో ఏర్పడేది డబుల్ ఇంజిన్ సర్కారే

- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు
- తెలంగాణలో బీజేపీ క్రమంగా బలోపేతం అవుతోందన్న రాంచందర్ రావు
- చదువుకున్న యువత పార్టీలో చేరుతున్నారని వెల్లడి
- సనాతన ధర్మాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని వ్యాఖ్య



**హైదరాబాద్ :** తెలంగాణలో రాబోయే రోజుల్లో బీజేపీ నేతృత్వంలో 'డబుల్ ఇంజిన్ ప్రభుత్వం' ఏర్పాటు కావడం ఖాయమని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు ధీమా వ్యక్తం చేశారు. సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్‌లో జరిగిన పార్టీ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. దక్షిణ తెలంగాణలో బీజేపీ క్రమంగా బలోపేతం కావడం శుభపరిణామమని, చదువుకున్న యువత పెద్ద సంఖ్యలో పార్టీలోకి చేరుతుండటం మార్పుకు సంకేతమని పేర్కొన్నారు.సనాతన ధర్మాన్ని రక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్న ఆయన... అనేక దేశాలు క్రిస్టియన్, ముస్లిం దేశాలుగా మారినా సనాతన ధర్మాన్ని ఏ శక్తీ నిర్మూలించలేక పోయిందని అన్నారు. ప్రస్తుతం యువజన ఉద్యమాల - మిగతా 2 లో

### ఒక అధికారిని ఎక్కడ నియమించాలనేది
## ప్రభుత్వ విచక్షణాధికారం

- తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- హైడ్రా కమిషనర్‌ను తప్పించాలన్న హైకోర్టు
- ఘాటుగా స్పందించిన రేవంత్ రెడ్డి
- హైడ్రా కమిషనర్ రంగనాథ్‌ను తొలగించాలన్న హైకోర్టు ఆదేశాలను సమీక్షిస్తామన్న సీఎం



**హైదరాబాద్ :** హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్‌ను తక్షణం విధుల నుంచి తప్పించాలంటూ హైకోర్టు వెలువరించిన - మిగతా 2 లో

### మేం ఎవరికి ఏం అమ్మాలో
## ఎవరూ చెప్పనక్కర్లేదు


- టర్కీకి ఎఫ్-35 విమానాల విక్రయంపై నెతన్యాహుకు ట్రంప్ షాక్
- టర్కీకి ఎఫ్-35 ఫైటర్ జెట్లను విక్రయించడంపై నెతన్యాహు అభ్యంతరం
- టర్కీ తమకు నమ్మకమైన భాగస్వామి అన్న ట్రంప్



**ఢిల్లీ :** టర్కీకి ఎఫ్-35 ఫైటర్ జెట్లను విక్రయించడంపై ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ - మిగతా 2 లో


## అట్టుడుకుతున్న పాక్ ఆక్రమిత కశ్మీర్

- కనీసం 20 మంది మృతి, పలువురికి గాయాలు
- పీఓకేలో లాంగ్ మార్చ్ సందర్భంగా హింస
- చర్చలు విఫలమవడంతో జేఏఏసీ ఆందోళన
- నిరసనకారులపై కాల్పుల ఆరోపణలు



**ఢిల్లీ :** పాక్ ఆక్రమిత కశ్మీర్ (పీఓకే)లో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. 'జాయింట్ అవామీ యాక్షన్ కమిటీ (జేఏఏసీ)' చేపట్టిన లాంగ్ మార్చ్ సందర్భంగా జరిగిన హింసలో కనీసం 20 మంది మృతి చెందారు. పలువురు తీవ్రంగా గాయపడ్డారు. వారిలో కొందరి పరిస్థితి విషమంగా ఉంది. దీంతో మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని సమాచారం.జేఏఏసీ - మిగతా 2 లో

## నేర చరిత్ర లేని
# వారిపై చర్యలు వద్దు



- విద్యార్థుల ఆందోళనలపై సుప్రీం కీలక ఆదేశాలు
- విద్యార్థుల ఆందోళనలపై సిట్ కు దిశానిర్దేశం
- అదుపులో ఉన్న మైనర్లను విడుదల చేయాలని ఆదేశం
- ఎలక్ట్రానిక్ ఆధారాలు భద్రపరచాలని సూచన
- కేంద్రం, ఏడు రాష్ట్రాలకు నోటీసులు

**ఢిల్లీ :** నీట్-యూజీ 2026 ప్రశ్నపత్రం లీక్ ఆరోపణలపై దేశవ్యాప్తంగా జరిగిన విద్యార్థుల ఆందోళనల సందర్భంగా పోలీసుల బలప్రయోగం, పోలీసులపై జరిగిన దాడులపై స్వతంత్ర దర్యాప్తు అవసరమని సుప్రీంకోర్టు అభిప్రాయపడింది. ఈ వ్యవహారంపై రిటైర్డ్ సుప్రీంకోర్టు న్యాయమూర్తి నేతృత్వంలో ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) ఏర్పాటు చేసే అంశాన్ని పరిశీలిస్తున్నట్లు తెలిపింది. అలాగే నేర చరిత్ర లేని విద్యార్థి నిరసనకారులపై తదుపరి ఉత్తర్వులు వచ్చే వరకు - మిగతా 2 లో



### జపాన్‌ను వణికించిన
## భారీ భూకంపం

- సునామీ హెచ్చరిక జారీ
- జపాన్‌లోని కుమమోటోలో 7.1 తీవ్రతతో భారీ భూకంపం
- క్యుషు ద్వీపంలోని కుమమోటో సమీపంలో భూకంప కేంద్రం
- తీర ప్రాంతాలకు సునామీ హెచ్చరిక

**ఢిల్లీ :** జపాన్‌లోని దక్షిణ ప్రాంతాన్ని మంగళవారం మధ్యాహ్నం భారీ భూకంపం వణికించింది. క్యుషు ద్వీపంలోని కుమమోటో ప్రిఫెక్చర్‌లో రిక్టర్ స్కేలుపై 7.1 తీవ్రతతో ఈ భూకంపం సంభవించింది. దీంతో జపాన్ వాతావరణ సంస్థ వెంటనే తీర ప్రాంతాలకు సునామీ హెచ్చరికలు జారీ చేసింది.స్థానిక కాలమానం ప్రకారం మధ్యాహ్నం ఈ భూకంపం సంభవించినట్లు అధికారులు వెల్లడించారు. కుమమోటో నగర సమీప ప్రాంతం కేంద్రంగా, భూమికి 10 కిలోమీటర్ల లోతులో ప్రకంపనలు నమోదయ్యాయి. అరియాకే, - మిగతా 2 లో

## జూరాలకు
# పోటెత్తుతున్న కృష్ణమ్మ



- శ్రీశైలం డ్యామ్ కు పెరుగుతున్న వరద ప్రవాహం
- కృష్ణానది ఎగువన కురుస్తున్న కుండపోత వర్షాలు
- జూరాల ప్రాజెక్టుకు 32 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో
- క్రస్ట్ గేట్లు ఎత్తేసిన అధికారులు.. శ్రీశైలం జలాశయానికి వరద


**అమరావతి :** రెండు తెలుగు రాష్ట్రాల్లో ఎల్ నినో ప్రభావం కారణంగా తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయి. అయినప్పటికీ కృష్ణానది మాత్రం జలకళను సంతరించుకుంటోంది. కృష్ణా నది ఎగువ పరీవాహక ప్రాంతాల్లో కురుస్తున్న కుండపోత వర్షాలతో ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు వరద ఉద్ధృతి గణనీయంగా పెరిగింది. వారం రోజులుగా ఎగువ రాష్ట్రాలైన మహారాష్ట్ర, కర్ణాటక పరీవాహక ప్రాంతాల్లో విస్తారంగా వానలు పడుతుండటంతో - మిగతా 2 లో

## అందరికీ ఆధునిక
# వైద్యం అందించడమే లక్ష్యం

- ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు
- దేశంలోనే తొలిసారిగా అమరావతిలో ప్రెసిషన్ ఆంకాలజీ క్యాన్సర్ సెంటర్
- ఏపీ ప్రభుత్వంతో ఆస్ట్రాజెనెకా ఒప్పందం
- ఏపీ ప్రభుత్వంతో ఆస్ట్రాజెనెకా, ఇతర దిగ్గజ సంస్థల ఒప్పందం
- అమరావతిలో ఇంటిగ్రేటెడ్ జెనోమిక్ సొల్యూషన్స్ సెంటర్ ఏర్పాటు
- ఊపిరితిత్తులు, రొమ్ము కేన్సర్ రోగులకు అధునాతన జన్యు పరీక్షలు
- దేశంలోనే తొలిసారిగా ప్రెసిషన్ ఆంకాలజీ విధానం ప్రారంభం
- అందరికీ ఆధునిక వైద్యం అందించడమే లక్ష్యమన్న సీఎం చంద్రబాబు



**అమరావతి :** ఆంధ్రప్రదేశ్ ఆరోగ్య రంగంలో మరో కీలక ముందడుగు పడింది. అంతర్జాతీయ ఫార్మా, బయోటెక్ దిగ్గజ సంస్థలైన ఆస్ట్రాజెనెకా, స్ట్రాండ్ లైఫ్ సైన్సెస్, క్యూర్ ఏఐ సంస్థలతో రాష్ట్ర ప్రభుత్వం కీలక అవగాహన ఒప్పందాలు కుదుర్చుకుంది. ముఖ్యమంత్రి చంద్రబాబు సమక్షంలో ఈ ఒప్పందాలు జరిగాయి. ఈ ఒప్పందంలో భాగంగా, అమరావతిలో దేశంలోనే మొట్టమొదటి ఇంటిగ్రేటెడ్ ప్రెసిషన్ ఆంకాలజీ విధానాన్ని ప్రారంభించనున్నారు.ఈ ఒప్పందం ప్రకారం ఆస్ట్రాజెనెకా ఇండియా, అమరావతిలో 'ఇంటిగ్రేటెడ్ జెనోమిక్ సొల్యూషన్స్ సెంటర్'ను ఏర్పాటు చేయనుంది. ఈ కేంద్రం ద్వారా ముఖ్యంగా ఊపిరితిత్తులు, రొమ్ము కేన్సర్ రోగులకు అవసరమైన అధునాతన జన్యు పరీక్షలు, బయోమార్కర్ టెస్టింగ్ సేవలను అందిస్తారు. దీనివల్ల కేన్సర్ చికిత్సలో కచ్చితమైన, వేగవంతమైన ఫలితాలు సాధించేందుకు వీలు కలుగుతుంది.ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ, రాష్ట్ర - మిగతా 2 లో



# సంపాదకీయం

## వాఘా.. గుండెలు ఉప్పొంగలేదు!



చిన్నప్పటి నుంచి మన దేశ సరిహద్దుల గురించి వినీ చదివీ ఒక చరిత్ర విద్యార్థిగా ఉప్పొంగిపోయాను. ఉత్తరాన హిమాలయాలు మంచుతో నిండివుంటాయనీ-- కైబర్, బోలాన్ కనుమల గుండా ఇతర ప్రాంతాల నుంచి మన దేశంలోకి శతాబ్దాలుగా మానవ సంచారం జరిగిందని చదువుకుని, మాకు మేమే ఉత్తేజితులమయ్యాం. బౌద్ధ భిక్షువులే కాక హర్షుడి కాలం నుంచి హుయన్‌త్సాంగ్, అలెగ్జాండర్, రాహుల్ సాంకృత్యాయన్ వంటి ఎందరో మహనీయులు మానవ నాగరికతకు, సంస్కృతికి, చరిత్రకు వారధి కట్టారు. అదంతా మనసులో నిండివుండడంతో డెబ్బై మూడేళ్ల వయసులో పదిమందితో కలిసి హిమాలయాల సందర్శనానికి సాహసంతోనే బయలుదేరాం. వారిలో సగంమంది అరవైలు దాటినవాళ్లు. మిగిలినవాళు యాభైలలో ఉన్న యువకులు. ఇదంతా దేనికంటే-- ఈ వయసులో శ్రీనగర్ నుంచి లేహ్ మీదుగా నుబ్రావాలి, కృతుంగాపాస్, పాన్‌గాంగ్ సరస్సుదాకా ఆక్సిజన్ లెవల్స్‌తో ఇబ్బంది పడతామని తెలిసి కూడా సాహసించాం. పాన్‌గాంగ్ (చైనా సరిహద్దు) నుంచి కార్గిల్ (పాకిస్థాన్ సరిహద్దు) దాకా ప్రయాణించి అద్భుతమైన పర్వతాలను, మరోవైపు దిగంతాలను తలపించే లోయలను చూస్తూ-- ప్రమాదభరితమని తెలిసినా సంతోషంగా గడిపాం. ఇంత ఆనందంలో చివరి రోజు, చివరి ఘట్టం ఎంత దిగులుగా, నిరాశగా, నిస్పృహగా మిగిలిందంటే-- మా పదిహేను రోజుల యాత్రను నీరసపరిచింది. భారతీయులుగా 'వాఘా' సరిహద్దు సైనిక కవాతు చూడడం నిజంగా గర్వకారణం. మేమంతా ఎప్పటినుంచో ఆ బోర్డర్‌లో ప్రదర్శించే సైనిక కవాతు గురించి వినివున్నాం. నెట్‌లో చూసి కూడా ఎంతో ఉత్తేజితులం అయివున్నాం. అయితే మేము వెళ్లినరోజు అక్కడి ప్రదర్శన మాకు అత్యంత నిరాశను కలిగించింది. ఈ నెల తొమ్మిదో తేదీ అయిదు గంటలకల్లా ఆగమేఘాల మీద అక్కడికి చేరుకున్నాం. ఆ వేల మందిలో కూర్చునే చోటు దక్కించుకుని ప్రదర్శన కోసం ఉత్కంఠతో ఎదురుచూస్తున్నాం. అయిదున్నరకు ప్రదర్శన ప్రారంభమవుతుందన్నారు, ఆరున్నరకు గానీ ప్రారంభం కాలేదు. అది కూడా ఎంత నిరాశ కలిగించిందో చెప్పలేం. అయిదున్నరకు సందర్శకుల నుంచి-- మహిళలను ప్రదర్శన జరిగే చోటుకు పిలిచారు. వారితో జాతీయ జెండా ప్రదర్శింపజేశారు. అంతవరకే అయితే ఫరవాలేదు. కానీ దేశభక్తితో కూడిన పాటలు పెట్టి మహిళలతో చేతులు ఊపుతూ ప్రదర్శన చేయించారు. అదీ పోనీ అనుకుంటే-- ఈ చేరిన మహిళలు ఆ కవాతు జరిగే ప్రదేశంలో బతుకమ్మలాడారు. కొందరైతే చేతులు పట్టుకుని 'ఒప్పుల కుప్ప' ఆడారు. అది చూస్తూ మాకు ఎంత ఆవేదన కలిగిందో చెప్పలేం. మహిళలను ప్రతి దానిలో భాగం చేయాలనే కాంక్ష కొద్దీ ఈ మధ్య రథయాత్రలు, దేవుడి ఊరేగింపుల ముందు, కోలాటాలూ వేయించడం-- ఇది ఏ సంస్కృతో తెలియదుగానీ దిగువ మధ్యతరగతి స్త్రీలు ఈ ప్రదర్శనలకు ఆలంబన కావడం దురదృష్టం. గుడిలో పూజాకైంకర్యాలు చేసే దేవదాసీలను నిషేధించి-- వీధి ఊరేగింపుల్లో భక్తి పేరుతో ఎందుకు వీరిని తెస్తున్నారో అర్థం కావడం లేదు. దానినే సహించలేని సమాజికులుగా 'వాఘా' బోర్డర్ సైనిక కవాతు సందర్భంగా కూడా మహిళలను ఆ ట్రాక్‌లోకి ఆహ్వానించి ప్రదర్శనను ఇంత పేలవంగా, అగౌరవంగా జరపడం శోచనీయంగా భావిస్తున్నాం. చివరికి నెట్‌లో చూసినపాటి ప్రదర్శన కూడా లేకుండా సైనిక కవాతు ముగించారు. బోర్డర్ గేట్లు తీయడం లేదు. ఇరువైపుల సైనికుల కరచాలనం లేదు. ఇదంతా అనకూడదుగానీ ఏదో విన్యాసం కింద తయారయింది. భారతీయ పౌరులందరికీ దేశభక్తి ఎంతో మహోన్నతమైనది. ఆ మాట తలుచుకుంటే గుండెలు ఉప్పొంగుతాయి. దానికి ప్రతీక అయిన 'వాఘా బోర్డర్' కవాతును ఆ రోజు అలా చూడటం నాకు ఎంతో బాధాకరంగా అనిపించింది. ఇప్పటికైనా ప్రభుత్వం దీనిని సరిదిద్దుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నాను.

## అందరికీ ఆధునిక వైద్యం అందించడమే లక్ష్యం

**మొదటిపేజీ తరువాయి** - ప్రజలందరికీ అందుబాటు ధరల్లో అత్యాధునిక వైద్య సదుపాయాలు తీసుకురావడమే ఈ ఒప్పందం లక్ష్యమని పేర్కొన్నారు. కేవలం వైద్య సేవలే కాకుండా, ఫార్మా, బయోటెక్నాలజీ రంగాల్లో క్వాంటం స్థాయి పరిశోధనలు జరగాల్సిన అవసరం ఉందని ఆయన సూచించారు. ఈ ఒప్పందంతో ఏపీ ఆరోగ్య, పరిశోధన రంగాలకు కొత్త ఊపు వస్తుందని నిపుణులు భావిస్తున్నారు.

## జూరాలకు పోటెత్తుతున్న కృష్ణమ్మ

**మొదటిపేజీ తరువాయి** - జూరాలకు ఇన్‌ఫ్లో భారీగా వచ్చి చేరుతోంది. ప్రస్తుతం జూరాల ప్రాజెక్టుకు 32,000 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదవుతుండగా... అధికారులు క్రస్ట్ గేట్లు ఎత్తి వచ్చిన నీటిని వచ్చినట్లే దాదాపు 30,700 క్యూసెక్కులను దిగువకు విడుదల చేస్తున్నారు. జూరాల నుంచి ప్రవాహం నిలకడగా కొనసాగుతుండటంతో దిగువన ఉన్న శ్రీశైలం జలాశయానికి కృష్ణమ్మ వేగంగా చేరుతోంది. మహారాష్ట్ర, కర్ణాటకలోని పశ్చిమ కనుమలతో పాటు భీమా నది పరీవాహక ప్రాంతాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది. భీమా నది ప్రవాహాలు కూడా తోడైతే జూరాలకు ఇన్‌ఫ్లోలు మరింత పెరిగే అవకాశం ఉంది. ఎగువ నుంచి వచ్చే ప్రవాహం భారీగా పెరిగే సూచనలు కనిపించడంతో, రాబోయే రోజుల్లో శ్రీశైలానికి మరింత జలకళ రానుందని నీటిపారుదల శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు.

## శివరాజ్ సింగ్ చౌహాన్ తో రేవంత్ రెడ్డి భేటీ

**మొదటిపేజీ తరువాయి** - సమావేశమయ్యారు. ఈ భేటీలో రాష్ట్రానికి చెందిన పలు కీలక గ్రామీణాభివృద్ధి అంశాలు, గృహ నిర్మాణం, ఉపాధి హామీ పథకాల విస్తరణపై సుదీర్ఘంగా చర్చించారు. గత ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలో గ్రామీణ గృహనిర్మాణ రంగం తీవ్ర నిర్లక్ష్యానికి గురైందని ఈ సందర్భంగా కేంద్ర మంత్రికి రేవంత్ వివరించారు. ఈసారి నిరుపేదల సొంతింటి కలను నెరవేర్చేందుకు 'ప్రధాని ఆవాస్ యోజన - గ్రామీణ్' 2.0 కింద తెలంగాణకు 11.56 లక్షల ఇళ్లను కేటాయించాలని కోరారు. అదే సమయంలో, రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను ఉపాధి హామీ జాబితాలో చేర్చి, దానిద్వారా లబ్ధిదారులకు 90 రోజుల పాటు పని కల్పించి ఆర్థిక భరోసా ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. మరోవైపు, ఎల్‌నినో ప్రతికూల పరిస్థితుల వల్ల దెబ్బతింటున్న గ్రామీణ కుటుంబాలను, రైతులను ఆదుకునేందుకు ఉపాధి హామీ పథకం పరిధిని విస్తరించాలని రేవంత్ రెడ్డి కోరారు. కూరగాయల పందిళ్లు, పశుగ్రాస ప్లాట్ల పెంపకం, మల్బరీ తోటలు, పట్టు పురుగుల పెంపక షెడ్ల నిర్మాణాలతో పాటు భూముల అభివృద్ధి, నీటి సంరక్షణ పనులను ఈ పథకం కింద అనుమతించాలని కోరారు. అలాగే ప్రకృతి వైపరీత్యాల వల్ల దెబ్బతిన్న వ్యవసాయ భూముల పునరుద్ధరణ పనులను కూడా ఇందులో చేర్చి, రైతాంగానికి, గ్రామీణ ఉపాధి రంగానికి కేంద్రం తగిన సహాయసహకారాలు అందించాలని విన్నవించారు.

## ఒక అధికారిని ఎక్కడ నియమించాలనేది ప్రభుత్వ విచక్షణాధికారం



**మొదటిపేజీ తరువాయి** - ఆదేశాలపై తెలంగాణ ప్రభుత్వం స్పందించింది. ఈ ఉత్తర్వులను సమీక్షిస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. హైడ్రా కార్యకలాపాలు యథావిధిగా కొనసాగుతాయని, ఆ సంస్థను మరింత బలోపేతం చేస్తామని ఆయన పేర్కొన్నారు. మంగళవారం ఢిల్లీలో మీడియాతో మాట్లాడిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, హైడ్రా అనేది తమ ప్రభుత్వం ప్రవేశపెట్టిన అతిపెద్ద సంస్కరణ అని అభివర్ణించారు. ఆక్రమణదారులు నకిలీ పత్రాలతో న్యాయస్థానాలను తప్పుదోవ పట్టిస్తూ, సోషల్ మీడియా వేదికగా ఏజెన్సీకి వ్యతిరేకంగా దుష్ప్రచారం చేస్తున్నారని ఆయన ఆరోపించారు. "బతుకమ్మ కుంటను ఆక్రమించింది పేదలా లేక పెద్దలా ఒక బీఆర్ఎస్ నేత అక్కడ 10 ఎకరాలు కబ్జా చేశారు. ఎన్ కన్వెన్షన్ పేదలదా గండిపేట చెరువు వద్ద కూల్చివేసినవి సామాన్యుల నిర్మాణాలా" అని ముఖ్యమంత్రి ప్రశ్నించారు. భూ కబ్జాలకు పాల్పడే వారు ఎంతటి వారైనా వదిలిపెట్టే ప్రసక్తే లేదని ఆయన స్పష్టం చేశారు. కబ్జాదారులను రక్షించేందుకు భారీగా నిధులు వెచ్చిస్తూ సామాజిక మాధ్యమాల్లో అసత్య ప్రచారాలు చేయిస్తున్నారని రేవంత్ రెడ్డి మండిపడ్డారు. గతంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా పనిచేసిన సోమేశ్ కుమార్‌పై 400 కోర్టు ధిక్కరణ కేసులు ఉన్న విషయాన్ని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. హైడ్రా విషయంలో ప్రభుత్వానికి పూర్తి స్పష్టత ఉందని, ఒక అధికారిని ఎక్కడ నియమించాలన్నది ప్రభుత్వ విచక్షణాధికారమని ఆయన పేర్కొన్నారు. తప్పుడు కేసులను న్యాయస్థానాల్లోనే ఎదుర్కొంటామని స్పష్టం చేశారు.

# నేర చరిత్ర లేని వారిపై చర్యలు వద్దు



**మొదటిపేజీ తరువాయి** - ఎలాంటి బలవంతపు చర్యలు తీసుకోవద్దని ఆదేశించింది. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్య బాగ్చి, జస్టిస్ వి. మోహనతో కూడిన ధర్మాసనం ఈ కేసును విచారించింది. పిటిషనర్ల ఆరోపణలు ప్రాథమికంగా స్వతంత్ర, నిష్పాక్షిక దర్యాప్తు అవసరాన్ని సూచిస్తున్నాయని పేర్కొంది. ఈ అంశంపై కేంద్రంతో పాటు అసోం, బీహార్, కేరళ, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్, పశ్చిమ బెంగాల్ ప్రభుత్వాలకు నోటీసులు జారీ చేసింది. ఆందోళనల సందర్భంగా అదుపులోకి తీసుకున్న మైనర్లను వెంటనే విడుదల చేయాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. కేవలం నిరసనల్లో పాల్గొన్నారనే కారణంతో అరెస్టు చేసిన లేదా అదుపులో ఉంచిన విద్యార్థులకు నేర చరిత్ర లేకపోతే వారిని కూడా విడుదల చేయాలని స్పష్టం చేసింది. అయితే క్రిమినల్ నేపథ్యం ఉన్న వారికి ఈ రక్షణ వర్తించదని పేర్కొంది. ఆందోళనలకు సంబంధించిన సీసీటీవీ దృశ్యాలు, డ్రోన్ వీడియోలు, బాడీ కెమెరా రికార్డింగులు, వైర్‌లెస్ కమ్యూనికేషన్ వివరాలు, పీసీఆర్ లాగ్‌లు సహా అన్ని ఎలక్ట్రానిక్ ఆధారాలను భద్రపరచాలని ధర్మాసనం ఆదేశించింది. విద్యార్థుల వ్యక్తిగత సమాచారం, డిజిటల్ డేటాను కూడా భద్రపరచాలని, అయితే ప్రస్తుతానికి వాటిని బహిర్గతం చేయవద్దని స్పష్టం చేసింది. పోలీసు సిబ్బందిపై జరిగిన దాడులపైనా సమగ్ర దర్యాప్తు అవసరమని సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా పేర్కొన్నారు. సుమారు 250 మంది పోలీసులకు కూడా గాయాలయ్యాయని తెలిపారు. నిరసనల్లో సంఘవిద్రోహ శక్తులు చొరబడి ఉండే అవకాశం ఉందని, నిజానిజాలు వెలుగులోకి రావాల్సిన అవసరం ఉందని అన్నారు. ఈ కేసు విచారణను సుప్రీంకోర్టు వచ్చే వారానికి వాయిదా వేసింది.

## మంత్రి నారా లోకేశ్ కు పేర్ని నాని బహిరంగ సవాల్

**మొదటిపేజీ తరువాయి** - విరుచుకుపడ్డారు. డీఎస్సీ అవకతవకలపై బహిరంగ చర్చకు రావలసిందిగా ఆయన లోకేశ్ కు సవాల్ విసిరారు. ఒకవేళ చర్చకు ముఖ్యమంత్రి చంద్రబాబు వస్తే వైసీపీ నుంచి జగన్ వస్తారని... లోకేశ్ వస్తే స్వయంగా తానే ఎదుర్కొంటానని స్పష్టం చేశారు. డీఎస్సీ పేరుతో నిరుద్యోగ యువత జీవితాలతో కూటమి ప్రభుత్వం చెలగాటమాడుతోందని పేర్ని నాని ఆరోపించారు. ప్రభుత్వం దీనిని 'మెగా డీఎస్సీ' అని ప్రచారం చేసుకుంటున్నప్పటికీ, లోపల జరిగిన అక్రమాల వల్ల ఇది 'దగా డీఎస్సీ'గా మారిందని మండిపడ్డారు. మంత్రిగా లోకేశ్ విద్యాశాఖ బాధ్యతలను పక్కనబెట్టి మిగిలిన అన్ని శాఖల వ్యవహారాల్లో జోక్యం చేసుకుంటున్నారని విమర్శించారు. కొంచెమైనా నైతికత ఉంటే ఈ కుంభకోణానికి బాధ్యత వహిస్తూ లోకేశ్ వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. నిరుద్యోగులకు న్యాయం జరిగే వరకు, డీఎస్సీ అక్రమాలపై పూర్తిస్థాయి విచారణ జరిపించి మంత్రి పదవికి లోకేశ్ రాజీనామా చేసేంత వరకు తమ పోరాటం ఆగేది లేదని హెచ్చరించారు. చంద్రబాబు ప్రభుత్వం కేవలం తమ సొంత ప్రచార సాధనాలు, పత్రికల ప్రయోజనాల కోసమే పనిచేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. అదే సమయంలో ఎమ్మెల్యే బొండా ఉమ మంత్రి పదవి కోసం తీవ్రంగా లాబీయింగ్ చేస్తున్నారంటూ చేశారు.

## జపాన్‌ను వణికించిన భారీ భూకంపం

**మొదటిపేజీ తరువాయి** - యత్సుషిరో సముద్ర తీరాల్లో సుమారు ఒక మీటర్ ఎత్తున అలలు ఎగిసిపడే ముప్పు ఉందని, ప్రజలందరూ తీరానికి దూరంగా సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని అధికారులు హెచ్చరించారు. భూకంపం కారణంగా కుమమోటో ప్రాంతంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. భద్రతా కారణాల దృష్ట్యా బుల్లెట్ రైళ్లతో సహా అన్ని రైలు సర్వీసులను తాత్కాలికంగా రద్దు చేశారు. క్యూషు ద్వీపంలోని కుమమోటో, నాగసాకి, కగోషిమా, ఫుకుయోకా, సాగా, ఒయిటా, మియాజాకి ప్రాంతాల్లో జపాన్ ప్రభుత్వం తదుపరి అత్యవసర భూకంప హెచ్చరికలను జారీ చేసింది. జపాన్‌లో ప్రతి ఏటా వందలాది భూకంపాలు సంభవిస్తుంటాయి. ప్రపంచవ్యాప్తంగా సంభవించే భూకంపాలలో దాదాపు 18 శాతం జపాన్‌లోనే నమోదవుతుంటాయి. వీటిలో అత్యధిక శాతం స్వల్ప తీవ్రత కలిగినవే అయినప్పటికీ, కొన్నిసార్లు తీవ్ర నష్టం వాటిల్లుతుంది. 2011లో రిక్టర్ స్కేలుపై 9.0 తీవ్రతతో సంభవించిన వినాశకర భూకంప వల్ల సుమారు 18,500 మంది ప్రాణాలు కోల్పోయారు. ఈ ఏడాది ఏప్రిల్ 20న జపాన్ ఉత్తర ప్రాంతంలో 7.7 తీవ్రతతో భూకంపం సంభవించిన సంగతి తెలిసిందే.

## అట్టుడుకుతున్న పాక్ ఆక్రమిత కశ్మీర్

**మొదటిపేజీ తరువాయి** - మంగళవారం ఎక్స్‌లో చేసిన పోస్టు ప్రకారం.. లాంగ్ మార్చ్ బృందాలు రావల్‌కోట్‌కు చేరుకున్నాయి. ఇప్పటివరకు 19 మంది మృతుల గుర్తింపును నిర్ధారించామని తెలిపింది. తలకు బుల్లెట్ గాయం అయిన మరో వ్యక్తి వద్ద గుర్తింపు పత్రాలు లేకపోవడంతో మొత్తం మృతుల సంఖ్య 20కి చేరిందని పేర్కొంది. పరిస్థితులు సాధారణమైన తర్వాత మరిన్ని వివరాలు వెల్లడిస్తామని తెలిపింది. జేఏఏసీ, పాకిస్థాన్ అధికారుల మధ్య చర్చలు విఫలం కావడంతో ఈ లాంగ్ మార్చ్ చేపట్టారు. ఆదివారం మీర్‌పూర్ డివిజన్ నుంచి ప్రారంభమైన నిరసన ర్యాలీ సోమవారం ముజఫరాబాద్ వైపు సాగింది. మరోవైపు పాక్ భద్రతా బలగాలు శాంతియుత నిరసనకారులపై సోమవారం సాయంత్రం కాల్పులు, టియర్ గ్యాస్, భారీ బలప్రయోగానికి పాల్పడ్డాయని 'యునైటెడ్ కశ్మీర్ పీపుల్స్ నేషనల్ పార్టీ' (యూకేపీఎన్‌పీ) ఆరోపించింది. దీంతో పలువురు మృతి చెందగా, మరికొందరు గాయపడ్డారని పేర్కొంది. ఈ ఘటనపై ఐక్యరాజ్యసమితి, అంతర్జాతీయ మానవ హక్కుల సంస్థలు వెంటనే జోక్యం చేసుకోవాలని యూకేపీఎన్‌పీ కోరింది. శాంతియుత నిరసనకారులపై కాల్పులు, అధిక బలప్రయోగాన్ని నిలిపివేయాలని పాకిస్థాన్‌పై ఒత్తిడి తీసుకురావాలని విజ్ఞప్తి చేసింది. మరోవైపు పీఓకేలో జరుగుతున్న నిరసనలపై భారత విదేశాంగ శాఖ గత నెల స్పందించింది. అక్కడ పోలీసుల దౌర్జన్యాల్లో పలువురు మరణించారని, అనేక మంది గాయపడ్డారని పేర్కొంటూ పాకిస్థాన్‌ను అంతర్జాతీయ సమాజం జవాబుదారీగా నిలపాలని ఆశిస్తున్నట్లు విదేశాంగ శాఖ ప్రతినిధి రణధీర్ జైస్వాల్ తెలిపారు.

## మేం ఎవరికి ఏం అమ్మాలో ఎవరూ చెప్పనక్కర్లేదు

**మొదటిపేజీ తరువాయి** - నెతన్యాహు వ్యక్తం చేసిన అభ్యంతరాలను అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీవ్రంగా తోసిపుచ్చారు. తాము ఎవరికి ఏ ఆయుధాలు అమ్మాలో ఎవరూ తమకు చెప్పాల్సిన అవసరం లేదని ఎయిర్‌ఫోర్స్ వన్ విమానంలో విలేకరులతో మాట్లాడుతూ ట్రంప్ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఇజ్రాయెల్ ప్రధానితో భేటీకి ముందు రోజు ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేయడం అంతర్జాతీయంగా తీవ్ర ప్రాధాన్యత సంతరించుకుంది. టర్కీ ప్రెసిడెంట్ రెజెప్ తయ్యిప్ ఎర్డోగాన్‌ను తన మంచి మిత్రుడిగా అభివర్ణించిన ట్రంప్... టర్కీ తమకు అత్యంత విలువైన, నమ్మకమైన భాగస్వామి అని కొనియాడారు. అంతకుముందు ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు ఒక ఇంటర్వ్యూలో మాట్లాడుతూ, టర్కీ తీవ్రవాద భావజాలంతో కూడిన పాలనలో ఉందని, అలాంటి దేశానికి ఎఫ్-35 యుద్ధ విమానాలను విక్రయిస్తే పశ్చిమాసియాలో సైనిక సమతుల్యత దెబ్బతింటుందని ఆందోళన వ్యక్తం చేశారు. అయితే ఈ విమర్శలకు ట్రంప్ ఘాటుగా స్పందిస్తూ, ఇజ్రాయెల్‌కు టర్కీపై మంచి అభిప్రాయం లేకపోవచ్చు కానీ తన విషయంలో మాత్రం టర్కీ ఎంతో నమ్మకంగా వ్యవహరించిందని స్పష్టం చేశారు.

## "ప్రతి సంవత్సరం ఫీజు రీఎంబర్స్‌మెంట్ చెల్లిస్తాం

**మొదటిపేజీ తరువాయి** - గ్లోబరీనా వంటి సంస్థలపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కేంద్ర చట్టాల మేరకు రాష్ట్రంలో చట్టాలు రూపొందిస్తామని, ఫీజు రీఎంబర్స్‌మెంట్ కొట్టేయాలని చూసిన సంస్థలపై విచారణ జరుగుతోందని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. బకాయి పెట్టిన ఫీజు రీఎంబర్స్‌మెంట్ రూ.8 వేల కోట్లు భారంగా మారిందని అన్నారు. ఫీజు రీఎంబర్స్‌మెంట్ తాము ఇవ్వట్లేదనే భ్రమలు కల్పించే యత్నం చేస్తున్నారని విమర్శించారు. ఫీజు రీఎంబర్స్‌మెంట్‌పై రామచందర్‌రావు, ఆర్.కృష్ణయ్య పదేపదే ప్రశ్నిస్తున్నారని తెలిపారు. ఏపీలో రూ.10 వేల కోట్ల ఫీజు రీఎంబర్స్‌మెంట్ బకాయిలు ఉన్నాయని, ఆర్.కృష్ణయ్య ఆయన ప్రాతినిధ్యం వహిస్తున్న ఏపీ రాష్ట్రంలో బకాయిలపై మాట్లాడరని సీఎం తెలిపారు. ఏపీలో ఎన్డీఏ ప్రభుత్వం ఉందని, అక్కడ బకాయిలపై మాట్లాడాలని, ఏపీలో ఫీజు రీఎంబర్స్‌మెంట్ చెల్లించాక తెలంగాణ గురించి మాట్లాడితే బాగుంటుందని సూచించారు. ఏ ఏడాదికి సంబంధించిన బకాయిలు అదే ఏడాది చెల్లిస్తామని, ఏటా ఫీజు రీఎంబర్స్‌మెంట్ చెల్లించేందుకు ప్రణాళికలు రచించామని, భవిష్యత్తులో ఫీజు రీఎంబర్స్‌మెంట్ సమస్య తెలంగాణలో ఉండదని స్పష్టం చేశారు. విద్యాశాఖలో రాష్ట్ర పరిధి అధికారాలను కేంద్రం లాక్కునే ప్రయత్నం. యూనివర్సిటీలపై ఆధిపత్యం చలాయించాలని కేంద్రం యత్నిస్తోంది. విద్య వీలైనంత వరకు రాష్ట్ర పరిధిలో ఉంటే తప్పిదాలు జరగకుండా ఉంటాయి. కేంద్ర చట్టాల మేరకు రాష్ట్రంలో ప్రక్షాళనపై యోచిస్తాం. పబ్లిక్ సర్వీస్ కమిషన్ ప్రక్షాళన చేసి నియామకాలు చేపట్టాం. రాష్ట్రంలో పారదర్శకంగా పరీక్షలు నిర్వహించాం. విద్యార్థులకు నమ్మకం కలిగించేలా ప్రభుత్వం పరీక్షలు నిర్వహిస్తోందన్న సీఎం రేవంత్ రెడ్డి.

## తెలంగాణలో ఏర్పడేది డబుల్ ఇంజిన్ సర్కారే



**మొదటిపేజీ తరువాయి** - ముసుగులో విదేశీ నిధులు సేకరిస్తూ దేశాన్ని విభజించేందుకు కొన్ని కుట్రలు సాగుతున్నాయని, దేశ సమగ్రతను కాపాడుకోవడానికి ప్రజలంతా ఐక్యంగా ఉండాలని పిలుపునిచ్చారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియపై జరుగుతున్న తప్పుడు ప్రచారాన్ని రాంచందర్ రావు తీవ్రంగా ఖండించారు. ఇది ప్రతి పదేళ్లకు ఒకసారి సాధారణంగా జరిగే ప్రక్రియ మాత్రమేనని, దీనిని అడ్డుపెట్టుకుని అనవసర భయాందోళనలు సృష్టించేందుకు యత్నిస్తున్నారని హెచ్చరించారు. దేశ భద్రత విషయంలో ఎలాంటి ఒడిదుడుకులను సహించేది లేదని ఆయన స్పష్టం చేశారు.

# ఏపీపై ఎల్‌నినో పంజా.. సీఎం చంద్రబాబు ఉన్నతస్థాయి సమీక్ష

**ఏపీపై ఎల్‌నినో తీవ్ర ప్రభావం.. జూలైలో 69 శాతం లోటు వర్షపాతం**

**రానున్న నెలల్లో 40 శాతం వరకు వర్షాభావ పరిస్థితులు**

**పత్తి, వరి పంటలపై ప్రభావం.. 122 మండలాలను గుర్తించిన ప్రభుత్వం**

**పంటల రక్షణకు అత్యవసర ప్రణాళిక.. ప్రత్యామ్నాయాలపై దృష్టి**



పశుగ్రాసానికి కొరత లేదు.. 5 నెలలకు సరిపడా నిల్వలు సిద్ధం

ఆంధ్రప్రదేశ్‌పై ఎల్‌నినో ప్రభావం తీవ్రంగా చూపుతోంది. రాష్ట్రంలో నెలకొన్న వర్షాభావ పరిస్థితులు, ప్రభుత్వ పరంగా తీసుకోవాల్సిన చర్యలపై ముఖ్యమంత్రి చంద్రబాబు ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. వ్యవసాయ, ఉద్యాన, పశుసంవర్ధక, నీటిపారుదల శాఖల అధికారులతో ఆయన సమావేశమయ్యారు. ఈ సమీక్షకు మంత్రి అచ్చెన్నాయుడు జూమ్ ద్వారా హాజరయ్యారు. ఈ సందర్భంగా అధికారులు పరిస్థితి తీవ్రతను ముఖ్యమంత్రికి వివరించారు. రాష్ట్రంలో జూలై నెలలో ఏకంగా 69 శాతం లోటు వర్షపాతం నమోదైందని తెలిపారు. రాబోయే మూడు నెలల్లో సగటున 35 నుంచి 40 శాతం వరకు వర్షపాతం తక్కువగా నమోదయ్యే అవకాశం ఉందని అంచనా వేశారు. జూన్ నుంచి నవంబర్ మధ్య కాలంలో సాధారణంగా 844 మి.మీ వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా, ఈసారి కేవలం 551 మి.మీ మాత్రమే కురిసే అవకాశం ఉందని పేర్కొన్నారు. అంచనాలకు మించి ఎల్‌నినో ప్రభావం ఉండబోతోందని అధికారులు స్పష్టం చేశారు. ఈ ప్రభావం అన్ని జిల్లాల్లో ఉన్నప్పటికీ ముఖ్యంగా పశ్చిమ గోదావరి, ప్రకాశం, అన్నమయ్య, కృష్ణా, కడప జిల్లాల్లో వర్షాభావ పరిస్థితులు ఎక్కువగా ఉంటాయని అధికారులు తెలిపారు. దీనివల్ల రాష్ట్రవ్యాప్తంగా సుమారు 2.78 లక్షల హెక్టార్లలో పత్తి, 1.07 లక్షల హెక్టార్లలో వరి పంటలపై తీవ్ర ప్రభావం పడుతుందని అంచనా వేశారు. ముఖ్యంగా శ్రీకాకుళం జిల్లాలో వరి పంటకు ఎక్కువ నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని చెప్పడంతో, వంశధార జలాలను తరలించి పంటలను కాపాడేందుకు ప్రయత్నించాలని సీఎం చంద్రబాబు సూచించారు. ప్రభుత్వం ఇప్పటికే రాష్ట్రంలో 122 హై రిస్క్ మండలాలను గుర్తించిందని అధికారులు తెలిపారు. ఈ మండలాల్లో బోరు బావుల ఆధారంగా పంటలను కాపాడుకునే అవకాశాలను పరిశీలించాలని సీఎం ఆదేశించారు. రైతులకు అవగాహన కల్పించేందుకు ఆగస్ట్ 3 నుంచి ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టనున్నట్లు, వరికి ప్రత్యామ్నాయ పంటలను ప్రోత్సహించేలా అత్యవసర విత్తన ప్రణాళికను సిద్ధం చేసినట్లు అధికారులు వివరించారు. ఫసల్ బీమా యోజన, వాతావరణ ఆధారిత పంటల బీమా పథకం కింద నమోదుకు ఈ నెల 31 వరకు గడువు ఉందని, వరి పంటకు మాత్రం ఆగస్ట్ 15 వరకు సమయం ఉందని అధికారులు గుర్తుచేశారు. మరోవైపు, పశుగ్రాసానికి ఎలాంటి ఇబ్బంది లేకుండా ఐదు నెలలకు సరిపడా 286.30 లక్షల మెట్రిక్ టన్నుల గ్రాసాన్ని అందుబాటులో ఉంచామని పశుసంవర్ధక శాఖ అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు.

# హైదరాబాద్‌లో భారీవర్షంతో చెరువుల్లా మారిన రహదారులు

**కిలోమీటర్ల మేర నిలిచిన ట్రాఫిక్**

**హైదరాబాద్ నగరంలో ఒక్కసారిగా భారీ వర్షం**

**కురిసిన భారీవర్షంతో రహదారులన్నీ జలమయం**

**పలుచోట్ల పొంగి పొర్లుతున్న డ్రైనేజీలు**

**ట్రాఫిక్ ఎక్కడికక్కడ నిలిచిపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న వాహనదారులు**



హైదరాబాద్ నగరంలో మంగళవారం సాయంత్రం ఒక్కసారిగా భారీ వర్షం కురిసింది. మధ్యాహ్నం నుంచి ఆకాశం పూర్తిగా మేఘావృతం కాగా ఒక్కసారిగా వర్షం మొదలైంది. మొదట రాజేంద్ర నగర్‌లో ప్రారంభమైన వాన క్రమంగా నగరమంతా విస్తరిస్తూ వచ్చింది. అక్కడక్కడా భారీగా, కొన్ని చోట్ల మోస్తరుగా కురుస్తూ భాగ్యనగరాన్ని తడిపేసింది. ఒక్కసారిగా కురిసిన భారీవర్షంతో రహదారులు జలమయమయ్యాయి. పలుచోట్ల డ్రైనేజీలు పొంగి పొర్లుతున్నాయి. పలు ప్రాంతాల్లో నీరు నిల్వ ఉండటంతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ముషీరాబాద్‌లో అత్యధికంగా 31 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. మాదాపూర్, గచ్చిబౌలి రాయదుర్గం ప్రాంతాల్లో సాయంత్రం నుంచి కురుస్తున్న వర్షానికి రోడ్లు జలమయమయ్యాయి. వాన నీటితో రోడ్లు మునగడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. మాదాపూర్, కేపీహెచ్‌బీ మార్గంలో, మాదాపూర్ ఐకియా బయోడైవర్సిటీ మార్గంలో గచ్చిబౌలి రాయదుర్గం మార్గంలో వాహనాలు నెమ్మదిగా కదులుతున్నాయి. కిలోమీటర్ దూరానికి గంట సమయం పడుతోంది. రాజేంద్రనగర్, అత్తాపూర్, హైదర్‌గూడా, ఉప్పరపల్లి, లంగర్‌హౌస్, కార్వాన్ తదితర ప్రాంతాల్లో వర్షం దంచికొట్టడంతో రహదారులు జలమయమయ్యాయి. ఇదే సమయంలో కార్యాలయాలు ముగిసే వేళ కావడంతో రోడ్లపై నీరు నిలిచి చెరువుల్లా మారాయి. దీంతో ట్రాఫిక్ ఎక్కడికక్కడ నిలిచిపోయి వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ప్రధాన కూడళ్ల వద్ద ట్రాఫిక్ నెమ్మదిగా సాగగా, ద్విచక్ర వాహనదారులు వర్షంలో తడుస్తూ గమ్యస్థానాలకు చేరుకునేందుకు ఇబ్బందిపడ్డారు. హైదర్‌గూడా టీవీఎన్‌ఆర్ ఎక్స్‌ప్రెస్ హైవే ఫ్లైఓవర్ కింద, పిల్లర్ నంబర్--216 సమీపంలో రోడ్డుపై భారీగా వర్షపు నీరు నిలిచిపోయింది. దీంతో ఆ మార్గంలో ట్రాఫిక్ నెమ్మదిగా సాగుతోంది. కేపీహెచ్‌బీ, నిజాంపేట్, బాచుపల్లి, ప్రాంతాల్లో ట్రాఫిక్ నెమ్మదిగా సాగుతోంది. ట్రాఫిక్ సమస్యలతో చాలామంది మెట్రోను ఆశ్రయించారు. దీంతో మెట్రో రైళ్లు, స్టేషన్లు ప్రయాణికులతో కిక్కిరిసిపోయాయి. కోఠిలో భారీ వర్షం పడడంతో రహదారులపై భారీగా నీరు చేరి ట్రాఫిక్ జామ్ అయ్యింది. ట్రాఫిక్‌లో అంబులెన్స్ కొద్దిసేపు చిక్కుకుపోయింది. దిల్‌సుఖ్‌నగర్ ప్రాంతంలో దంచికొడుతున్న వర్షంతో ఎక్కడి వాహనాలు అక్కడే నిలిచిపోతున్నాయి. దిల్‌సుఖ్‌నగర్, కొత్తపేట, సరూర్ నగర్, కర్మాన్ ఘాట్, మలక్‌పేట్, చాదర్ ఘాట్ పరిసర ప్రాంతాల్లో కురుస్తున్న వర్షంతో పలు రహదారులు జలమయమయ్యాయి. ముఖ్యంగా చాదర్‌ఘాట్ నుంచి మలక్‌పేట్ రైల్వే అండర్‌పాస్ వరకు భారీ ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. చాదర్‌ఘాట్ నుంచి మలక్‌పేట్ రైల్వే అండర్‌పాస్ వరకు వాహనాలు కిలోమీటర్ల మేర బారులు తీరాయి. కార్యాలయాల నుంచి ఇళ్లకు బయలుదేరిన ఉద్యోగులు, విద్యార్థులు, సాధారణ ప్రజలు ట్రాఫిక్‌లో చిక్కుకుని తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. వర్షం కొనసాగుతుండటంతో వాహనదారులు అప్రమత్తంగా ప్రయాణించాలని, వీలైతే ప్రత్యామ్నాయ మార్గాలను వినియోగించాలని ట్రాఫిక్ పోలీసులు సూచిస్తున్నారు. భారీవర్షం ప్రారంభంకాగానే జీహెచ్ఎంసీ, ఫైర్, హైడ్రా సిబ్బంది అప్రమత్తమయ్యారు. నీరు నిలిచే ప్రాంతాల్లో వర్షపు నీటిని తొలగించే పనులను వేగవంతం చేశారు. నగరంలో వర్షాల ప్రభావం కొనసాగొచ్చని వాతావరణ శాఖ ఇప్పటికే హెచ్చరికలు జారీ చేసింది.

# ఎల్కతుర్తి మండలంలోని రైతు వేదికలో రైతు నేస్తం కార్యక్రమానికి హాజరైన హన్మకొండ జిల్లా కలెక్టర్





**ఎల్కాతుర్తి జులై 28 ప్రజా మంటలు :** ఎల్కతుర్తి మండలంలోని ఎల్కతుర్తి రైతువేదికలో జరిగినటువంటి రైతు నేస్తం కార్యక్రమం 100 ఎపిసోడ్ వీడియో కాన్ఫరెన్స్ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హనుమకొండ జిల్లా కలెక్టర్ శ్రీమతి.చాహత్ బాజ్ పాయ్ పాల్గొనడం జరిగింది. ఈ రైతు నేస్తం కార్యక్రమం రాష్ట్రవ్యాప్తంగా రైతు వేదికలలో నిర్వహించబడుతుంది ఇందులో భాగంగా వీడియో కాన్ఫరెన్స్ ద్వారా శాస్త్రవేత్తలు అధికారులు రైతులకు సలహాలు సూచనలు ఇస్తుంటారు ఇది ప్రతి మంగళవారం నిర్వహించబడుతుంది. ఇందులో రైతులు ప్రత్యక్షంగా తమ తమ సందేహాలను శాస్త్రవేత్తలతో చర్చించి నివృత్తి చేసుకోవడానికి అవకాశం కలదు. అలాగే ఈ కార్యక్రమం ఈరోజు 100 ఎపిసోడ్లు విజయవంతంగా పూర్తి అయిన సందర్భంగా రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి శ్రీ తుమ్మల నాగేశ్వరరావు అలాగే ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శ్రీ సంజయ్ జాజు , వ్యవసాయ శాఖ ముఖ్య కార్యదర్శి శ్రీ సురేంద్ర మోహన్ మరియు వ్యవసాయ శాఖ డైరెక్టర్ శ్రీ బి గోపి సచివాలయం నుండి రైతులను ఉద్దేశించి మాట్లాడడం జరిగింది. ఈ కార్యక్రమంలో రైతు నేస్తం కార్యక్రమానికి తప్పనిసరిగా హాజరవుతూ శాస్త్రవేత్తలు సలహాలు పాటిస్తున్నటువంటి రైతులని జిల్లాకి ముగ్గురు చొప్పున సన్మానించడం జరిగింది. వారిలో ఎల్కతుర్తి మండలం నుంచి కొమ్మిడి రాజి రెడ్డి హసన్ పర్తి మండలం నుంచి శ్రీ వన్నెపు బుచ్చి రెడ్డి , దామెర మండలం నుంచి మంద ఎల్లయ్య గారిని జిల్లా కలెక్టర్ మరియు జిల్లా అధికారులు సన్మానించడం జరిగింది. అలాగే జిల్లాలో ఈ రైతు నేస్తం కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహిస్తూ ఉత్తమ సేవలు అందించినటువంటి ఇద్దరు వ్యవసాయ విస్తరణ అధికారులను సన్మానించడం జరిగింది. ఇందులో హనుమకొండ వ్యవసాయ డివిజన్ నుంచి ఎల్కతుర్తి మండలం ఎల్కతుర్తి క్లస్టర్ ఏఈఓ శ్రీ మోడెం పున్నంచందర్ గారిని, ఆత్మకూరు మండలంలోని పెద్దాపూర్ క్లస్టర్ ఏఈఓ శ్రీమతి గాజుల ప్రవళిక గారిని జిల్లా కలెక్టర్ సన్మానించడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రైతులు ఎల్ నినో ఎఫెక్ట్ కారణంగా వర్షాభావ పరిస్థితుల దృష్ట్యా తక్కువ నీటితో సాగయ్యే ఆరుతడి పంటల వైపు ఆసక్తి చూపాలని ,ఆరుతడి పంటలు సాగు చేసి నష్టాలను తగ్గించుకోవాలని సూచించడం జరిగింది. అలాగే కేశవపూర్ గ్రామానికి చెందిన రైతు ఎడవెల్లి.రవీందర్ రెడ్డి తనకు ఉన్న పూర్తి 8 ఎకరాల విస్తీర్ణంలో ఆయిల్ పామ్ సాగు చేస్తున్నారు వారిని ఈ కార్యక్రమంలో సత్కరించడం జరిగింది.ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి శ్రీ ఎన్.విజయ్ చంద్ర , జిల్లా ఉద్యానవన శాఖ అధికారి శ్రీ కమలాకర్ రెడ్డి , టి.ఆర్.వి.కే శాస్త్రవేత్త శ్రీ నర్సయ్య ,సహాయ వ్యవసాయ సంచాలకులు హన్మకొండ డివిజన్ శ్రీ.డి. ఆది రెడ్డి , ఆయిల్ ఫెడ్ డి.ఎం. శ్రీ. ఎస్ .శంకర్ , ది .విశాల సహకార సంఘం చైర్మన్ శ్రీపతి రవీందర్ గౌడ్ వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ శ్రీమతి భాగ్యలక్ష్మి , స్థానిక సర్పంచ్ శ్రీమతి మునిగడప లావణ్య సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు వీరనారాయణపురం సర్పంచ్ శ్రీ పుల్లూరి శ్రీధర్ రావు దామెర సర్పంచ్ శ్రీమతి మంకని పద్మ ఇందిరానగర్ సర్పంచ్ శ్రీ అంబాల రాజు , ఎంపీడీవో శ్రీ ఎన్ విజయ్ కుమార్ , తహసిల్దార్ శ్రీ ప్రసాదరావు , మండల వ్యవసాయ అధికారి శ్రీ.ఎం. రాజ్ కుమార్ , సాంకేతిక వ్యవసాయ అధికారులు శ్రీ కె.రాజ్ కుమార్ శ్రీ టీ.కమలాకర్ ,శ్రీ ఎండి .అఫ్జల్ పాషా , ఎంపీఓ రవి , ఏపీఎం కవిత , ఏపీవో అనిత , ఈసీ శ్రీకాంత్ , ఎల్కతుర్తి గ్రామ ఉపసర్పంచ్ శ్రీ గొడిశాల రాజు, వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్లు గొడిశాల రాజన్న వ్యవసాయ విస్తరణ అధికారులు శ్రీ.ఎం పున్నంచందర్ , వివిధ గ్రామాల రైతులు పాల్గొని ఈ కార్యక్రమంలో విజయవంతం చేయడం జరిగింది.

## తెలంగాణ ఫోరెన్సిక్ సైన్స్ లాబొరేటరీ లో శాస్త్రీయ అధికారిగా ఎంపికైన డా.సిఎం. హరీష్ కు డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ నియామక పత్రాలు అందజేశారు



**గొల్లపల్లి జులై 28 ప్రజా మంటలు :** హైదరాబాద్లో జేఎన్టీయూపీహెచ్డీ పూర్తి చేసినగొల్లపల్లి మండలానికి చెందిన చెవుల మద్ది హరీష్ తల్లి చెవులమద్ది రామవ్వ, తండ్రి నర్సయ్య. సాధారణ కూలి , ఆర్థికంగా వెనుకబడిన కుటుంబం నుంచి వచ్చి, కష్టపడి ఈ స్థాయికి చేరుకోవడం ఎంతోస్ఫూర్తిదాయకంతెలంగాణ పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు జారీ చేసిన రాష్ట్ర నోటిఫికేషన్ ద్వారా ఆయన ఈ ఉద్యోగాన్ని పొందారు. ఈ సందర్భం డా. హరీష్‌కు, కుటుంబ సభ్యులకు గర్వకారణమైన, మరపురాని క్షణంగా నిలిచింది.తన ప్రయాణంలో అండగా నిలిచిన కుటుంబ సభ్యులు, స్నేహితులు, గురువులు శ్రేయోభిలాషులకు డా. హరీష్ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

# కాల భైరవ సహిత అష్టభుజ దుర్గాదేవి ఆలయంలో మండల పూజ హోమం



**గొల్లపల్లి జులై 28 ప్రజా మంటలు :** గొల్లపల్లి మండల కేంద్రంలో కాలభైరవ సహిత అష్టభుజ దుర్గా దేవి దేవాలయంలో మండల పూజా కార్యక్రమం నేటి కీ 41 రోజులు స్థిర విగ్రహ ప్రతిష్ట అయిన సందర్భంగా మండల పూజ ప్రతిష్ట అయిన నుండి నేటి వరకు అఖండ జ్యోతి ప్రజ్వలన నిత్యం ఉదయం మూర్తి విగ్రహాలకు పంచామృత అభిషేకముతో పాటు విగ్రహాలకు అలంకరణ మహా గణపతి పూజ సూర్యాది నవగ్రహ పూజ, ఇంద్రాది అష్టదిక్పాలకుల పంచలోక పాలక పూజ ఏకాశీతి వాస్తు మంటప పూజ అష్ట భుజ దుర్గ మాత హవనం వాస్తు హోమం అనంతరం తీర్థ ప్రసాద స్వీకరణ అన్న ప్రసాద వితరణ నిర్వహించారుఈ కార్యక్రమంలో భక్తులు మహిళలు ప్రజలు అత్యధిక సంఖ్యలో పాల్గొన భక్తులకు ఆలయ అర్చక పురోహితులు ఎదులాపురం భాస్కర్ రేవెల్లి తిరుపతి ఆశీర్వచనం చేశారు పూర్ణాహుతితో ముగించారు ఆలయ కమిటీ సభ్యులు దాతల సహకారంతో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు

## కేజీ వి బి స్కూల్లో హెచ్ పి వి వ్యాక్సిన్ వేసిన ప్రాథమిక ఆరోగ్య వైద్యులు



**ఎల్కతుర్తి జులై 28 ప్రజా మంటలు :** వ్యాక్సినేషన్. తేదీ 28.7.2026 రోజున హ్యూం వ్యాక్సిన్ ఖ+ఎదీ ఎల్కతుర్తి స్కూల్లో 14 సంవత్సరాలు నిండిన అమ్మాయిలకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఎలుకతుర్తి డాక్టర్ ఎం. రాజశేఖర్ గారి పర్యవేక్షణలో 16 మంది పిల్లలకు హ్యూం వ్యాక్సిన్ ఇవ్వడం జరిగినది ముందుగా పిల్లల యొక్క తల్లిదండ్రులను పిలిచి హ్యూం వ్యాక్సిన్ యొక్క ప్రాముఖ్యతను వివరించి వారి సమ్మతితో ఇవ్వడం జరిగినది ఈ కార్యక్రమంలో ఎదీ స్పెషల్ ఆఫీసర్ శ్రీమతి అనితా దేవి మరియు సూపర్వైజర్స్ ఎల్కతుర్తి ఉపకేంద్రం యొక్క సిస్టర్స్ .శ్రీమతి బి.సరూప రాణి మరియు పుష్పలత ఆశ జంపాల రాధిక పాల్గొనడం జరిగినది.

# జగిత్యాల వైద్య రంగ అభివృద్ధికి కీలక నిర్ణయాలు

### 450 పడకల ఆసుపత్రి పనులు వేగవంతం చేయాలని ఆదేశం



**హైదరాబాద్, జూలై 28 (ప్రజా మంటలు):** జగిత్యాల జిల్లా వైద్య వ్యవస్థ అభివృద్ధిపై రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జగిత్యాల ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్, కోరుట్ల ఎమ్మెల్యే డా.సంజయ్ పాల్గొని జిల్లా వైద్య రంగానికి సంబంధించిన పలు కీలక అంశాలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు.జగిత్యాలలో మెడికల్ కాలేజీ, నర్సింగ్ కాలేజీ, పారామెడికల్ కోర్సుల విస్తరణపై సమావేశంలో చర్చించారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ఆసుపత్రుల్లో అవసరమైన మందుల నిల్వలు ఎప్పటికప్పుడు అందుబాటులో ఉంచాలని, కొరత ఉంటే వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలని మంత్రి అధికారులను ఆదేశించారు.జగిత్యాల ప్రభుత్వ ఆసుపత్రికి దూరంగా ఉన్న రేడియాలజీ విభాగాన్ని ఆసుపత్రి ప్రధాన ప్రాంగణంలోకి మార్చే అంశాన్ని ఎమ్మెల్యే ప్రస్తావించగా, దీనిపై మంత్రి సానుకూలంగా స్పందించారు.రూ.235 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న 450 పడకల నూతన ప్రభుత్వ ఆసుపత్రి నిర్మాణాన్ని వేగంగా పూర్తి చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అలాగే మెడికల్ కాలేజీ, హాస్టల్ నిర్మాణ పనులను సెప్టెంబర్ నెలాఖరులోగా పూర్తి చేయాలని సూచించారు.ఆసుపత్రికి కొత్త అంబులెన్స్‌తో పాటు విద్యార్థుల రవాణా కోసం ప్రత్యేక బస్సును మంజూరు చేస్తామని మంత్రి హామీ ఇచ్చారు. పాత బస్టాండ్ ఆసుపత్రిలో వెల్‌నెస్ సెంటర్ ఏర్పాటుకు రూ.2 కోట్ల నిధులు కేటాయించే విషయాన్ని కూడా సమావేశంలో చర్చించారు.మాతా--శిశు ఆసుపత్రి ప్రారంభంతో పాటు ట్రామా సెంటర్ ఏర్పాటు చేయాలని గతంలో చేసిన విజ్ఞప్తిని ఎమ్మెల్యే మరోసారి ప్రస్తావించగా, జగిత్యాల పాత బస్టాండ్ ఆసుపత్రిలో ట్రామా సెంటర్ ఏర్పాటు చేస్తామని మంత్రి హామీ ఇచ్చినట్లు ఎమ్మెల్యే తెలిపారు. దీనికి సంబంధించి అధికారులకు అవసరమైన చర్యలు చేపట్టాలని మంత్రి ఆదేశించినట్లు వెల్లడించారు.జగిత్యాల, రాయికల్ వైద్య ఆరోగ్య కేంద్రాల అభివృద్ధితో పాటు గ్రామీణ ప్రాంతాల్లో మరిన్ని పల్లె దవాఖానాలు, జగిత్యాల పట్టణంలోని నూకపల్లి అర్బన్ కాలనీలో బస్తీ దవాఖాన మంజూరు చేయాలని ఎమ్మెల్యే కోరగా, మంత్రి సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు.ఈ సమీక్ష సమావేశంలో ప్రిన్సిపల్ సెక్రటరీ క్రిస్టినా, డీఎంఈ శివరాం ప్రసాద్, వైద్య ఆరోగ్య శాఖ డైరెక్టర్, మెడికల్ కాలేజీ సూపరింటెండెంట్ డా. కృష్ణమూర్తి, డీసీహెచ్ఎస్ డా. రామకృష్ణ, డీఎంహెచ్‌వో డా. సుజాతతో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## జగన్నాథ్‌పూర్‌లో వడ్డెర సంఘం గ్రామ కమిటీ ఏర్పాటు



**ఎల్కతుర్తి జులై 28 ప్రజా మంటలు :** ఎల్కతుర్తి మండలంలోని జగన్నాథ్‌పూర్ గ్రామంలో వడ్డెర సంఘం గ్రామ కమిటీని ఘనంగా ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమం జిల్లా ఉపాధ్యక్షులు వల్లేపు సుధాకర్ హుస్నాబాద్ నియోజకవర్గ వడ్డెర సంఘం అధ్యక్షులు బొంత రమేష్ ఎల్కతుర్తి మండల అధ్యక్షులు గొలేన ఎల్లయ్య ఆధ్వర్యంలో నిర్వహించరు ఈ కార్యక్రమానికి ఎల్కతుర్తి పట్టణ అధ్యక్షులు ఓర్సు కుమారస్వామి ప్రధాన కార్యదర్శి అల్లెపు ప్రశాంత్ కోశాధికారి అల్లెపు రాజు హాజరై నూతన కమిటీ సభ్యులను అభినందించారు. గోపాల్ పూర్ గ్రామ అధ్యక్షులు సూర మొగిలి ఉపాధ్యక్షులు గండికోట జంపయ్య ప్రధాన కార్యదర్శి ఓర్సు కొమురయ్య సహాయ కార్యదర్శి గండికోట రాము పాల్గొని కార్యక్రమాన్ని చేపట్టారు అనంతరం జగన్నాథ్‌పూర్ గ్రామ వడ్డెర సంఘం నూతన కమిటీలో మహిళా అధ్యక్షురాలిగా శివరాత్రి ఈశ్వరమ్మ అధ్యక్షులుగా శివరాత్రి మల్లయ్య గౌరవాధ్యక్షులుగా బొంత అనిల్ ఉపాధ్యక్షులుగా బొంత సది ప్రధాన కార్యదర్శిగా శివరాత్రి మొగిలి కార్యదర్శిగా బొంత సాంబారాజు కోశాధికారిగా శివరాత్రి చిరంజీవి ప్రచార కార్యదర్శిగా కస్తూరి కుమార్ లు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులందరికీ నాయకులు హృదయపూర్వక అభినందనలు తెలియజేశారు. వారి నాయకత్వంలో జగన్నాథ్‌పూర్ గ్రామంలోని వడ్డెర సంఘం మరింత బలోపేతమై గ్రామాభివృద్ధి మరియు వడ్డెర సమాజ సంక్షేమానికి విశేష సేవలు అందించాలని ఆకాంక్షించారు.

# సర్వీస్ రోడ్డు, యూ-టర్న్ ఏర్పాటు చేయాలని శాంతినగర్ గ్రామస్థుల డిమాండ్





**ఎల్కతుర్తి జులై 28 ప్రజా మంటలు :** ఎల్కతుర్తి మండలం శాంతినగర్ గ్రామానికి జాతీయ రహదారి (చీఎ-563) నుంచి గ్రామంలోకి ప్రవేశించేందుకు, అలాగే హుజురాబాద్ వైపు వెళ్లేందుకు సరైన యూ-టర్న్, సర్వీస్ రోడ్డు లేకపోవడంతో గ్రామస్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రోజువారీ రాకపోకలతో పాటు విద్యార్థులు, రైతులు, వాహనదారులు అదనపు దూరం ప్రయాణించాల్సిన పరిస్థితి నెలకొంది.శాంతినగర్‌లో ప్రైవేట్ పాఠశాల, విద్యుత్ సబ్‌స్టేషన్, రైస్‌మిల్, విస్తారమైన వ్యవసాయ భూములు ఉండటంతో ఈ సమస్య మరింత తీవ్రమైంది. గ్రామస్థులు తమ వ్యవసాయ భూములకు వెళ్లాలంటే చిన్న పాపయ్యపల్లి అండర్‌బ్రిడ్జి వరకు వెళ్లి తిరిగి శాంతినగర్ చేరుకోవాల్సి వస్తోంది. అలాగే హుజురాబాద్‌కు వెళ్లాలంటే వల్బాపూర్ వరకు వెళ్లి అక్కడి నుంచి యూ-టర్న్ తీసుకుని తిరిగి ప్రయాణించాల్సి వస్తోంది. దీంతో సమయం, ఇంధనం, ప్రయాణ వ్యయం అనవసరంగా పెరుగుతున్నాయని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ఇప్పటికే జాతీయ రహదారి నిర్మాణ పనులు పూర్తయినప్పటికీ గ్రామ సూచిక బోర్డు, బస్‌స్టాప్ నిర్మాణం చేపట్టకపోవడం కూడా స్థానికులను నిరాశకు గురిచేస్తోంది.గ్రామస్థులు ప్రధానంగా శాంతినగర్‌కు సర్వీస్ రోడ్డు నిర్మించడంతో పాటు, సురక్షితమైన యూ-టర్న్ సౌకర్యం కల్పించాలని ప్రభుత్వాన్ని, జాతీయ రహదారుల అధికారులను కోరుతున్నారు.ఈ సమస్య పరిష్కారం కోసం గత కొన్ని రోజులుగా హనుమకొండ జిల్లా కలెక్టర్‌కు గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేయడంతో పాటు జాతీయ రహదారుల (చీఎ) అధికారులకు పలుమార్లు వినతిపత్రాలు సమర్పించినప్పటికీ స్పందన లేకపోవడంతో గ్రామస్థుల్లో అసంతృప్తి నెలకొంది.దీంతో మంగళవారం గ్రామస్థులు, పాఠశాల విద్యార్థులతో కలిసి చీఎ-563పై ధర్నా నిర్వహించి తమ నిరసన వ్యక్తం చేశారు. సమాచారం అందుకున్న ఎల్కతుర్తి పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని, సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇవ్వడంతో గ్రామస్థులు ధర్నాను విరమించారు.శాంతినగర్ ప్రజలు కోరుతున్న కనీస రవాణా సౌకర్యాలను అధికారులు తక్షణమే కల్పించి, ప్రమాదాలకు ఆస్కారం లేకుండా శాశ్వత పరిష్కారం చూపాలని గ్రామస్థులు విజ్ఞప్తి చేస్తున్నారు.ఈ కార్యక్రమం లో గ్రామ సర్పంచ్ బాసాని వేళంగిమేరి రాయపురెడ్డి, కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షులు సాగర్ రెడ్డి, సందీప్ రెడ్డి, పెద్దారెడ్డి ప్రదీప్ రెడ్డి, ఇన్నారెడ్డి, పెంటారెడ్డి స్వప్న, సింగిరెడ్డి జ్యోతి, సెంట్ అన్స్ స్కూల్ యాజమాన్యం, రైతులు, పాల్గొన్నారు.

## మంత్రితో సమీక్ష సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే సంజయ్ కుమార్



**జగిత్యాల జిల్లా ప్రతినిధి, ( ప్రజా మంటలు) జూలై 28:** జగిత్యాల జిల్లా వైద్య, ఆరోగ్య వ్యవస్థ పై తెలంగాణ రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఆధ్వర్యంలో వారి కార్యాలయం నందు ఏర్పాటు చేసిన సమీక్ష సమావేశం లో పాల్గొనడం జరిగిందని జగిత్యాల ఎమ్మెల్యే డా.సంజయ్ కుమార్ తెలిపారు.జగిత్యాల జిల్లా కేంద్రంలో మెడికల్ కాలేజీ, నర్సింగ్ కాలేజీ, పారామెడికల్ కోర్సులపై చర్చించడం జరిగిందన్నారు.వర్షాకాలంలో వ్యాధులు ప్రబలకుండా ఆసుపత్రులలో మందుల వివరాలు, స్టాక్ అందుబాటులో ఉంచాలని,.కొరత ఉంటే దృష్టికి తీసుకురావాలని తెలిపినట్లు పేర్కొన్నారు.రేడియాలజీ విభాగం ఆసుపత్రికి కొంత దూరంలో ఉన్నందున్న హాస్పిటల్ పరిధిలోకి తీసుకురావాలని కోరడం జరిగిందన్నారు.నూతనంగా నిర్మిస్తున్న 235 కోట్ల తో 450పడకల ఆసుపత్రి త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారని తెలిపారు.మెడికల్ కాలేజీ, హాస్టల్ పనులు 9వ నెల లోపు పూర్తి చేయాలని ఆదేశించారు.ఆసుపత్రికి నూతన అంబులెన్స్, విద్యార్థులకు బస్సు మంజూరు చేస్తామని తెలిపారన్నారు.పాత బస్టాండ్ హాస్పిటల్ లో వెల్ నెస్ సెంటర్ కోసం 2కోట్ల నిధులు,మాతా శిశు ఆసుపత్రి ప్రారంభం నాడు ట్రామా సెంటర్ ఏర్పాటు చేయాలని మాజీ వైద్య, ఆరోగ్య మంత్రిని కోరడం జరిగిందని తెలపగాజగిత్యాల పాత బస్టాండ్ లో ట్రామా సెంటర్ ఏర్పాటు చేస్తామని మంత్రి హామీ ఇచ్చారని ఎమ్మెల్యే సంజయ్ కుమార్ పేర్కొన్నారు.అధికారులకు ఆదేశాలు కూడా జారీ చేయడం జరిగిందన్నారు.జగిత్యాల, రాయికల్ వైద్య, ఆరోగ్య కేంద్రాల అభివృద్ది పై చర్చించడం జరిగిందన్నారు. జగిత్యాల నియోజకవర్గానికి పల్లె దవాఖానలు, బీద మధ్యతరగతి ప్రజలు నివసించే అర్బన్ కాలని నూకపల్లిలో బస్తీ దవాఖాన మంజూరు చేయాలని కోరగా మంత్రి సానుకూలంగా స్పందించారని ఎమ్మెల్యే తెలిపారు.ఈ సమీక్ష సమావేశం లో కార్యక్రమంలో కోరుట్ల ఎమ్మెల్యే డా.సంజయ్, ప్రిన్సిపల్ సెక్రటరీ క్రిస్టినా, డి.ఎం.ఈ. శివరాం ప్రసాద్, డైరెక్టర్ ఆఫ్ హెల్త్ వివిధ శాఖల అధికారులు, మెడికల్ కాలేజీ సూపరిండెంట్ కృష్ణ మూర్తి, డా. రామకృష్ణ, డా.సుజాత వైద్య అధికారులు వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## డ్రంక్ అండ్ డ్రైవ్, మూడు రోజుల జైలు శిక్ష




**బుగ్గారం, ( ప్రజా మంటలు) జూలై 28:** డ్రంక్ అండ్ డ్రైవ్ లో ఓ వ్యక్తికి ధర్మపురి మెజిస్ట్రేట్ మంగళ వారం మూడు రోజుల జైలు శిక్ష విధించారు. బుగ్గారం ఎస్సై జి.సతీష్ కథనం ప్రకారం జగిత్యాల జిల్లా ఎస్పీ అశోక్ కుమార్, ఆదేశాల మేరకు, జగిత్యాల డిఎస్పి పురుషోత్తం రెడ్డి సూచనల మేరకు, ధర్మపురి సిఐ ఎ. రాంనర్సింహరెడ్డి ఆధ్వర్యంలో బుగ్గారం ఎస్సై జి. సతీష్ తన సిబ్బందితో కలిసి బుగ్గారం పోలీస్ స్టేషన్ పరిధిలో చేపట్టిన డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు చేపట్టారు. బుగ్గారం మండలం మద్దునూరు గ్రామానికి చెందిన గజ్జెల మొండయ్య అనునతడు డ్రంక్ అండ్ డ్రైవ్ లో పట్టుబడడం జరిగిందని ఎస్సై తెలిపారు. బుగ్గారం పోలీసు వారు పరీక్ష చేసి ధర్మపురి ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ జానకి ముందు హాజరు పరిచారు. మేజిస్ట్రేట్ గజ్జెల మొండయ్య కి మూడు రోజుల జైలు శిక్ష విధించారు. మెజిస్ట్రేట్ ఆదేశాల మేరకు ఆయనను జగిత్యాల సబ్ జైలు కు తరలించడం జరిగినదని బుగ్గారం ఎస్సై జి. సతీష్ తెలిపారు.ఈ సందర్భంగా ఎస్సై సతీష్ మాట్లాడుతూ రోడ్డుపైన ప్రయాణించే ప్రతి వాహనదారుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించి వాహనం నడపాలన్నారు. మద్యం సేవించి వాహనం నడుపరాదని, సీట్ బెల్ట్ తప్పకుండ ధరించాలని, అతివేగం నివారించడం, మైనర్ పిల్లలకు వాహనాలు ఇవ్వకుండా తల్లిదండ్రులు జాగ్రత్త పడాలని తెలిపారు. ఈ నిర్ణయాన్ని ఉల్లంఘించిన వారిపై తగిన చర్యలు తీసుకుంటామని ఎస్సై హెచ్చరించారు. ప్రతి ఒక్కరు రోడ్డు భద్రత పట్ల అవగాహన ఏర్పాటు చేసుకోవాలని తెలియజేశారు.

## నేరెళ్ల బాధితులకు న్యాయం చేయాలి - కల్వకుంట్ల కవిత



**సిరిసిల్ల జూలై 28(ప్రజా మంటలు):** సిరిసిల్ల జిల్లా నేరెళ్లలో జరిగిన పోలీసుల దాష్టీకం తెలంగాణ సమాజం సిగ్గుతో తలదించుకునే ఘటన అని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత అన్నారు. బాధితుడు గంధం గోపాల్ కుటుంబాన్ని, ఇతర బాధితులను పరామర్శించిన ఆమె, గత ప్రభుత్వంలో తాను భాగస్వామిగా ఉన్నందుకు క్షమాపణ కోరారు. ఘటనకు బాధ్యులైన పోలీసులకు, అక్రమ ఇసుక రవాణాతో సంబంధం ఉన్న వారిపై ఇప్పటికీ చర్యలు తీసుకోకపోవడాన్ని ప్రశ్నించారు.నేరెళ్ల బాధితుల పేరుతో రాజకీయ లబ్ధి పొందిన సీఎం రేవంత్ రెడ్డి, బండి సంజయ్, స్థానిక ఎమ్మెల్యే కేటీఆర్ బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. బాధిత కుటుంబాలకు ఒక్కో కుటుంబానికి రూ.1 కోటి పరిహారం ఇవ్వాలని, దోషులను శిక్షించాలని కోరారు. బాధితులకు న్యాయం జరిగే వరకు తమ పోరాటం కొనసాగుతుందని కవిత స్పష్టం చేశారు.


# అనారోగ్యంతో మరణించిన సెక్యూరిటీ గార్డు మారయ్య కుటుంబానికి అండ

### జీడీఎక్స్ సిబ్బంది ఆర్థిక సాయం



**సికింద్రాబాద్, జూలై 28 ( ప్రజామంటలు) :** సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రిలో సెక్యూరిటీ గార్డుగా విధులు నిర్వర్తిస్తూ ఇటీవల అనారోగ్యంతో అకాల మరణం చెందిన మారయ్య కుటుంబానికి జీడీఎక్స్ సెక్యూరిటీ విభాగం అండగా నిలిచింది. కష్టసమయంలో తోటి ఉద్యోగి కుటుంబాన్ని ఆదుకోవాలనే ఉద్దేశంతో జీడీఎక్స్ హెచ్‌ఆర్, జనరల్ మేనేజర్ సుధీర్‌తో పాటు సెక్యూరిటీ సూపర్‌వైజర్లు, సెక్యూరిటీ గార్డులు స్వచ్ఛందంగా తమకు తోచిన రీతిలో చందాలు సేకరించారు.ఈ సందర్భంగా సేకరించిన ఆర్థిక సహాయాన్ని మంగళవారం రోజున మారయ్య భార్య, ఆయన చిన్న కుమార్తె రోసిలకు సంస్థ ప్రతినిధులు నేరుగా అందజేశారు. ఈ క్లిష్ట సమయంలో మానవత్వంతో స్పందించి ఆర్థికంగా చేయూతనందించిన ప్రతీ ఒక్కరికీ యాజమాన్యం హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపింది. అందరి సహృదయత, సహకార భావం అభినందనీయమని, భవిష్యత్తులో కూడా ఇదే మంచి మనసుతో ఒకరికొకరం తోడుగా నిలబడదామని ఈ సందర్భంగా ప్రతినిధులు పేర్కొన్నారు.

## గాంధీ ఆస్పత్రి సెక్యూరిటీ ఉద్యోగి మారయ్యకు ఘన నివాళి



**సికింద్రాబాద్, జూలై 28 (ప్రజామంటలు):** గాంధీ ఆస్పత్రి జీడీఎక్స్ సెక్యూరిటీ విభాగంలో విధులు నిర్వర్తిస్తున్న ఉద్యోగి మారయ్య అకాల మరణం పట్ల సంస్థ సిబ్బంది, యాజమాన్యం తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశాయి. ఈ సందర్భంగా ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని కోరుతూ జీడీఎక్స్ సెక్యూరిటీ కుటుంబ సభ్యులు ఘనంగా నివాళు లర్పించారు. మారయ్య మృతి పట్ల జీడీఎక్స్ కంపెనీ తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల ప్రతినిధితో పాటు హెచ్‌ఆర్, జనరల్ మేనేజర్ మరియు పలువురు ఉన్నతాధికారులు మారయ్య కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.ఈ సందర్భంగా సంస్థ ప్రతినిధులు మాట్లాడుతూ... జీడీఎక్స్ సంస్థ ఎల్లప్పుడూ కార్మికులు, బడుగు బలహీన వర్గాలు, పేద కుటుంబాల సంక్షేమానికి కట్టుబడి ఉంటుందని స్పష్టం చేశారు. ఆపదలో ఉన్న ఉద్యోగుల కుటుంబాలకు అండగా నిలవడమే తమ ప్రాథమిక బాధ్యత అని పేర్కొన్నారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి కష్టసమయాల్లో ఉద్యోగుల కుటుంబాలకు అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు కంపెనీ ఎల్లప్పుడూ ముందుంటుందని హామీ ఇచ్చారు. మారయ్య పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని, ఈ తీరని విషాదాన్ని తట్టుకునే మనోధైర్యాన్ని ఆయన కుటుంబ సభ్యులకు ఆ భగవంతుడు ప్రసాదించాలని ఆకాంక్షించారు.

# 90 వేలు ఒక్క తిరుపతిలోనే తొలగించాల్సిన దొంగ ఓట్ల లెక్క ఇదీ

**సర్ ప్రక్రియలో భారీగా బయటపడుతున్న దొంగ ఓట్లు**

**ఒక్క తిరుపతిలోనే తొలగించాల్సిన ఓట్ల సంఖ్య 90 వేల పైమాటే**

**భారీ సంఖ్యలో చిరునామాల్లో లేని, శాశ్వతంగా వలసలు వెళ్లినవారు**



2021 తిరుపతి లోక్‌సభ ఉపఎన్నికలు జరిగిన తీరు అప్పట్లో తీవ్ర విమర్శలకు గురైన విషయం గుర్తుండే ఉంటుంది. ఎలాగైనా గెలిచి తీరాలని అప్పటి అధికార పార్టీ వైఎస్సార్సీపీ భారీగా దొంగ ఓట్లు చేర్చిందని, పక్క నియోజకవర్గాల నుంచీ ఓటర్లను తరలించిందన్న ఆరోపణలు వెల్లువెత్తాయి. వైఎస్సార్సీపీ దొంగ ఓట్లు చేర్చారన్న విషయం 'సర్'తో నిర్ధారణ అయ్యింది. ఒక్క తిరుపతి అసెంబ్లీ నియోజకవర్గంలోనే తొలగించాల్సినవి 90 వేల ఓట్లు ఉన్నాయంటే, ఎంతగా అవకతవకలు జరిగాయో ఊహించవచ్చు. అటు కర్నూలు, కడప, అనంతపురం, నెల్లూరు వంటి నియోజకవర్గాల్లోనూ ఇదే పరిస్థితి నెలకొంది. ఒక్క తిరుపతిలోనే 90 వేల దొంగ ఓట్లు తొలగించాల్సిన ఓట్ల లెక్క ఇదీ తిరుపతి శాసనసభ నియోజకవర్గంలో తొలగించాల్సిన ఓట్లు ఏకంగా 90 వేలకు పైగా ఉన్నట్లు, ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ-సర్‌లో వెల్లడైంది. వీరిలో 57 వేల మందికి పైగా శాశ్వతంగా వలస వెళ్లిపోయినవారే ఉన్నారు. మరో 20 వేల మందికి పైగా ఆ చిరునామాల్లో లేని వారు లేదా వివరాలు లభ్యం కానివారు ఉన్నారు. ఇంకో 6 వేల మందికి పైగా వ్యక్తులకు రెండేసి ఓట్లు ఉన్నాయి. దాదాపు మూడో వంతు నకిలీ ఓటర్లే తిరుపతి అసెంబ్లీ నియోజకవర్గంలో మొత్తం 2 లక్షల 95 వేల 288 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో 90 వేల 882 మంది అంటే 30.77 శాతం ఓట్లను తొలగించాల్సిన జాబితాలోకి ఎన్నికల సంఘం చేర్చింది. అలా చూస్తే ఇక్కడ దాదాపు మూడో వంతు నకిలీ ఓటర్లేనని తేటతెల్లమవుతోంది. వైఎస్సార్సీపీ హయాంలో తిరుపతి లోక్‌సభ ఉప ఎన్నిక వేళ ఆ పార్టీ నేతలు ప్రధానంగా తిరుపతి శాసనసభ పరిధిలో కల్పిత చిరునామాలు, వ్యక్తుల పేర్లతో భారీగా ఓట్లు చేర్చారు. నకిలీ ఓటరు ఐడీ కార్డులు తయారుచేయించారు. దొంగ ఓటర్లను తరలించి ఓట్లు వేయించారు. ఆ వ్యవహారమంతా ఇప్పుడు సర్‌లో బయటపడింది. రాష్ట్రంలోని పలు నియోజకవర్గాల్లో ప్రధానంగా రాయలసీమ జిల్లాల్లో వైఎస్సార్సీపీ నాయకులు అప్పట్లో భారీ ఎత్తున దొంగ ఓట్లు చేర్పించారన్న ఆరోపణలున్నాయి. అవన్నీ సర్‌లో వెలుగుచూశాయి. ఆ రెండు నియోజకవర్గాల్లోనే అత్యధికం: వైఎస్సార్సీపీ హయాంలోనే దొంగ ఓట్లపై ప్రతిపక్ష పార్టీల నాయకులు ఎన్నికల సంఘానికి అనేకసార్లు ఫిర్యాదులు చేశారు. ఇప్పుడు సర్‌లో లెక్కలతో సహా ఆ ఆరోపణలు నిజమేనని నిర్ధారణ అయ్యాయి. ఒక్క కర్నూలు అసెంబ్లీ నియోజకవర్గంలోనే 24.67 శాతం ఓట్లను తొలగించాల్సిన జాబితాలో చేర్చారు. నియోజకవర్గంలో 2 లక్షల 74 వేల 622 ఓట్లకు గాను తొలగించాల్సిన ఓట్లు 67 వేల 755 ఉన్నట్లు తేల్చారు. 22 వేల 210 మంది వివరాలు లభ్యం కాలేదు. మరో 28 వేల 594 మంది శాశ్వత వలసలు వెళ్లిపోయారు. 11 వేల 449 మందికి రెండేసి ఓట్లున్నాయి. పాణ్యంలోనూ 15.52 శాతం ఓట్లను తొలగించాల్సిన జాబితాలో ఉంచారు. కర్నూలు జిల్లా పరిధిలో 60 వేల 768 డబుల్ ఎంట్రీ ఓట్లు ఉంటే వాటిలో అత్యధికం కర్నూలు, పాణ్యం నియోజకవర్గాల్లోనే కనిపించాయి.

సగం మంది కడప నియోజకవర్గంలోనే: వైఎస్సార్సీపీ అధినేత జగన్ సొంత జిల్లాలోని కడప నియోజకవర్గంలో 2 లక్షల 83 వేల 973 మంది ఓటర్లు ఉండగా, అందులో 67 వేల 31 ఓట్లు తొలగించాల్సిన జాబితాలోకి చేర్చారు. ఇది 23.60 శాతం. 32 వేల 73 మంది ఓటర్లు వారి చిరునామాల్లో అందుబాటులో లేని, లేదా వివరాలు లభ్యం కానివారే. 18 వేల 557 మంది శాశ్వతంగా వలస వెళ్లిపోయారు. 8 వేల 669 మందికి రెండేసి ఓట్లున్నాయి. ఇక్కడి ఓట్లలో సుమారు పావు వంతు దొంగ ఓట్లేనని, అవన్నీ వైఎస్సార్సీపీ హయాంలో అధికారాన్ని అడ్డం పెట్టుకొని నమోదు చేసినవేనన్న ఆరోపణలున్నాయి. చిరునామాల్లో అందుబాటులో లేని లేదా వివరాలు లభ్యం కాని ఓటర్లు రాష్ట్రంలోనే అత్యధికంగా 79 వేల 40 మంది కడప జిల్లాలోనే ఉన్నారు. అందులో దాదాపు సగం కడప నియోజకవర్గంలోనే ఉన్నారు. వైఎస్సార్సీపీ హయాం నాటి ఓట్లు: తిరుపతి జిల్లా చంద్రగిరిలో 3 లక్షల 13 వేల 795 ఓట్లకు గాను 50 వేల 273 ఓట్లు తొలగింపు జాబితాలో ఉన్నాయి. వీరిలో 19 మందికి పైగా ఓటర్ల ఆచూకీ లేదు. 16 వేల మంది శాశ్వతంగా వలస వెళ్లిపోయారు. ఇవన్నీ వైఎస్సార్సీపీ హయాంలో నమోదైన దొంగ ఓట్లేనన్న విమర్శలున్నాయి. నెల్లూరు రూరల్‌లో 2 లక్షల 82 వేల 312 మంది ఓటర్లకు గాను 57 వేల 948 ఓట్లు తొలగించాల్సి ఉన్నట్లు గుర్తించారు. ఇందులో 18 వేల 287 మంది ఆచూకీ లభ్యం కాలేదు. 21 వేల 911 మంది శాశ్వతంగా వలస వెళ్లిపోయారని, 7 వేల 929 ఓట్లు డబుల్ ఎంట్రీలని తేలింది. అనంతపురం అర్బన్‌లో 2 లక్షల 82 వేల 463 మంది ఓటర్లకు గాను 53 వేల 790 ఓట్లు తొలగించాల్సి ఉందని తేల్చారు. ఇందులో 14 వేల 816 మంది ఆచూకీ లభ్యం కాలేదని,17 వేల 861 మంది శాశ్వతంగా వలస వెళ్లిపోయారని తేలింది. 10 వేల 556డబుల్ ఎంట్రీలున్నాయని గుర్తించారు.

# బంగాళాఖాతంలో తీవ్ర వాయుగుండం నేడు తీరం దాటే ఛాన్స్

**వాయవ్య బంగాళాఖాతంలో మరింత బలపడిన వాయుగుండం**

**హల్దియా సమీపంలో ఇవాళ తీరం దాటనున్నట్లు వాతావరణ శాఖ వెల్లడి**

**ఏపీలోని పలు జిల్లాల్లో మోస్తరు నుంచి తేలికపాటి వర్షాలకు అవకాశం**

వాయవ్య బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం మరింత తీవ్రరూపం దాల్చింది. మంగళవారం నాటికి ఇది తీవ్ర వాయుగుండంగా బలపడి తీరం వైపు దూసుకొస్తోంది. ప్రస్తుతం ఇది సముద్రంలో ఉత్తర దిశగా పయనిస్తూ, ఒడిశాలోని బాలాసోర్, బంగాల్‌లోని హల్దియా ప్రాంతాల మధ్య కేంద్రీకృతమై ఉందని భారత వాతావరణ కేంద్రం వెల్లడించింది.హల్దియా సమీపంలో తీరం దాటే అవకాశం తీవ్ర వాయుగుండం గమనంపై వాతావరణ శాఖ అధికారులు కీలక ప్రకటన చేశారు. మంగళవారం ఉదయం ఇది పశ్చిమ బెంగాల్‌లోని హల్దియాకు సమీపంలో తీరాన్ని తాకనుందని స్పష్టం చేశారు. తీరం దాటే సమయంలో సముద్రం తీవ్ర అలజడిగా ఉంటుందని, వాతావరణంలో ఒక్కసారిగా పెను మార్పులు చోటుచేసుకుంటాయని హెచ్చరించారు. ఆయా ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.ఈ జిల్లాల్లో మోస్తరు వర్షాలు తీవ్ర వాయుగుండం ప్రభావం ఆంధ్రప్రదేశ్‌పైనా కనిపిస్తోంది. దీని ఫలితంగా ఏపీలోని పలు జిల్లాల్లో వర్షాలు కురవనున్నాయి. అల్లూరి సీతారామరాజు, పార్వతీపురం మన్యం, కాకినాడ, పోలవరం జిల్లాల్లో మోస్తరు వర్షాలు పడతాయని వాతావరణ శాఖ తెలిపింది. అలాగే తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, ఏలూరు జిల్లాల్లో అక్కడక్కడా ఉరుములు, పిడుగులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే ప్రమాదం ఉందని వెల్లడించింది. ఈ ప్రాంతాల ప్రజలు చెట్ల కింద ఆశ్రయం పొందవద్దని అధికారులు సూచించారు.మరికొన్ని జిల్లాల్లో తేలికపాటి జల్లులు రాష్ట్రంలోని మరికొన్ని జిల్లాల్లో వాతావరణం చల్లబడనుంది. తేలికపాటి జల్లులు పడే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. ముఖ్యంగా విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల్లో అక్కడక్కడా వర్షాలు కురుస్తాయని తెలిపారు. వీటితో పాటు బాపట్ల, శ్రీసత్యసాయి, తిరుపతి జిల్లాల్లోనూ చెదురుమదురుగా వానలు కురవచ్చని వాతావరణ శాఖ పేర్కొంది.ఓడరేవుల్లో ప్రమాద హెచ్చరికలు తీవ్ర



వాయుగుండం తీరం దాటనున్న నేపథ్యంలో రాష్ట్ర విపత్తుల నిర్వహణ శాఖ అప్రమత్తమైంది. సముద్రం అల్లకల్లోలంగా ఉండటం, అలలు ఎగసిపడుతుండటంతో ఓడరేవుల్లో ప్రమాద హెచ్చరికలు జారీ చేసింది. శ్రీకాకుళం జిల్లా కళింగపట్నం నుంచి కాకినాడ వరకు ఉన్న ఓడరేవుల్లో మూడో నంబరు ప్రమాద హెచ్చరికను ఎగురవేశారు. అలాగే మిగిలిన కోస్తా తీరంలోని ఓడరేవుల్లో ఒకటో నంబరు ప్రమాద హెచ్చరికను జారీ చేశారు. వాతావరణం శాంతించే వరకు మత్స్యకారులు ఎవరూ సముద్రంలోకి వేటకు వెళ్లొద్దని అధికారులు ఆదేశాలు జారీ చేశారు.

# అన్నదాతలకు అలర్ట్ పంటల బీమా నమోదుకు సమీపిస్తున్న గడువు మిగిలింది మూడు రోజులే

**రాష్ట్రవ్యాప్తంగా 15.25 లక్షల ఎకరాలకే ప్రీమియం చెల్లించిన రైతులు**

**ఎల్‌నినో తరుముతున్నా మేల్కొనని వ్యవసాయాధికారులు, ప్రజాప్రతినిధులు**



పంటల బీమా నమోదుకు ఇంకా మూడు రోజుల గడువు మాత్రమే మిగిలి ఉంది. అయినప్పటికీ, కొన్ని జిల్లాల్లో నమోదు ప్రక్రియ ఆశించిన స్థాయిలో సాగడం లేదు. రాష్ట్రవ్యాప్తంగా రెండు బీమా పథకాల కింద కేవలం 15.25 లక్షల ఎకరాలకు మాత్రమే రైతులు ప్రీమియం చెల్లించారు. కొన్ని జిల్లాలు, మండలాల్లో ఈ సంఖ్య సున్నాగానే ఉంది. 'ఎల్ నినో' ముప్పు పొంచి ఉన్నప్పటికీ, స్థానిక వ్యవసాయ శాఖ అధికారులు, సిబ్బంది పంటల బీమాపై రైతులకు అవగాహన కల్పించడంలో విఫలమవుతున్నారు. అలాగే ప్రజాప్రతినిధులు కూడా దీనిపై ఏమాత్రం ఆసక్తి చూపడం లేదు. రైతులు పంటల బీమాను ఎంచుకునేలా ప్రోత్సహించేందుకు వ్యవసాయ శాఖ ప్రత్యేక శిబిరాలను నిర్వహిస్తే, కరువు కారణంగా పంటలు దెబ్బతిన్నప్పుడు వారికి పరిహారం పొందే అవకాశం ఉంటుంది. అనంతపురం, కర్నూలు జిల్లాల్లోనే 60 శాతం: పంటల బీమా నమోదులో కర్నూలు, అనంతపురం జిల్లాల రైతులు ముందున్నారు. ముఖ్యంగా, బీమా చేసిన మొత్తం 15.25 లక్షల ఎకరాలలో ఈ రెండు జిల్లాల వాటానే 60 శాతంగా ఉంది. నంద్యాల, శ్రీ సత్యసాయి, వైఎస్ఆర్ కడప జిల్లాల్లో నమోదు గణాంకాలు ఆశాజనకంగా ఉన్నప్పటికీ, మిగిలిన జిల్లాల్లో మాత్రం చాలా తక్కువగా ఉన్నాయి. ప్రధానంగా 'ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన' విషయానికొస్తే, 12 జిల్లాల్లో జిల్లాకు సగటున 1,000 ఎకరాల కంటే తక్కువ విస్తీర్ణానికే బీమా చేశారు. అలాగే 'వాతావరణ ఆధారిత పంటల బీమా పథకం' కింద తొమ్మిది జిల్లాల్లో సగటు నమోదు 500 ఎకరాల కంటే తక్కువగా ఉంది. పంటల బీమా నమోదుకు (జూలై చివరి వరకు) ఇంకా మూడు రోజులు మాత్రమే మిగిలి ఉన్నాయి. అయితే, వరి పంటకు మాత్రం గడువు తేదీ ఆగస్టు 15 వరకు ఉంది. ఎక్కువ విస్తీర్ణంలో పంటల బీమా కవరేజీని కల్పించడం ద్వారా రైతులకు కొంత మేరకైనా ప్రయోజనం చేకూరుతుంది. కొన్ని జిల్లాల్లో ప్రీమియంలు ఎక్కువగా ఉన్నాయి. అటువంటి ప్రాంతాల్లో ప్రభుత్వమే కొంత భారాన్ని తన వాటాగా భరించడం ద్వారా రైతులను ప్రోత్సహించాలి. ఖరీఫ్ సీజన్‌లో వరి, వేరుశనగ, కందులు, పత్తి, మిరప, మినుములు ,మొక్కజొన్న వంటి పంటలను విస్తృతంగా సాగు చేస్తారు. అయినప్పటికీ, కొన్ని జిల్లాల్లో నమోదు ప్రక్రియ నామమాత్రంగానే ఉంది. 2024 ఖరఫ్ తో పోల్చితే 21.42 శాతమే 2024 ఖరీఎ లో రాష్ట్రవ్యాప్తంగా బీమా 71.17 లక్షల ఎకరాలు ఈ ఏడాది ఇప్పటి వరకు 15.25 లక్షల ఎకరాలు 2024తో పోల్చితే 21.42 % మాత్రమే తక్కువ ప్రీమియంలు ఉన్నప్పటికీ కొన్ని పంటలకు ప్రీమియంలు చాలా తక్కువగా ఉన్నాయి. మిరప సాగు విస్తృతంగా జరిగే పల్నాడు జిల్లాలో, ఎకరాకు బీమా ప్రీమియం కేవలం రూ.360 మాత్రమే. వైఎస్ఆర్ కడప జిల్లాలో, ఎకరా కంది పంటకు ప్రీమియం కేవలం రూ.36 మాత్రమే ఉంది. అయినప్పటికీ, అవగాహన లేకపోవడం వల్ల రైతులు ఇందులో నమోదు చేసుకోవడం లేదు. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లాలో ఎకరం వరి పంటకు ప్రీమియం కేవలం రూ.76 మాత్రమే ఉన్నప్పటికీ, పథకం కింద కేవలం 15,000 ఎకరాలకు మాత్రమే పంట బీమా చేశారు.వరి సాగు విస్తృతంగా జరిగే అవిభక్త కృష్ణా, ఉభయ గోదావరి జిల్లాల్లో పంట బీమా నమోదు చాలా తక్కువగా ఉంది.

# ఎన్యూమరేషన్ ఫారం తిరిగివ్వని ఓటర్లు

**హైదరాబాద్ లో భారీగా ఓట్ల రద్దు**

**కంటోన్మెంట్‌లో 40 శాతం ఓట్లు రద్దు కేటగిరీలోకి**

**క్యూర్‌లోని పలు నియోజకవర్గాల్లోనూ అదే పరిస్థితి**

**ఆగస్టు 3 వరకు గడువుందని నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న తీరు**

**డిజిటలైజేషన్‌లో వేగం పెంచిన సిబ్బంది**

రాజధాని హైదరాబాద్‌లో ఓటర్ల సంఖ్య భారీగా తగ్గబోతోందంటే మీరు నమ్ముతారా కానీ ఇప్పుడు జరిగే వాస్తవం మాత్రం ఇదే. హైదరాబాద్‌లో నకిలీ ఓట్లు భారీగా ఉన్నాయి. అదే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన వారు కూడా గతంలో ఇక్కడ ఓటు నమోదు చేసుకున్నారు. దీంతో వారికి సొంత రాష్ట్రంలో సైతం ఓటు ఉంది. ఇలాంటి సమస్యలకు ఓటరు జాబితా సవరణ ప్రక్రియ చెక్ పెట్టేస్తుంది. రెండు రాష్ట్రాల్లో ఓటు ఉంటే 2 ఎన్యూమరేషన్ ఫారాలు ఇస్తున్నారు. కానీ ఓటర్లు తమకు నచ్చిన ఏదైనా ఒక దానిని మాత్రమే ఎంచుకోవాలి.లేదంటే రెండేళ్ల జైలు శిక్షతో పాటు జరిమానా విధిస్తామని ఎన్నికల అధికారులు ముందు నుంచీ చెబుతూనే ఉన్నారు. అవసరమైతే రెండు చోట్ల ఓటు రద్దు కూడా అవుతుందని హెచ్చరిస్తున్నారు. ఈ లెక్కన అప్రమత్తమైన ఓటర్లు తమ సొంత రాష్ట్రాలకే ప్రాధాన్యత ఇస్తున్నారు. దీని ప్రకారం హైదరాబాద్‌లో మహారాష్ట్ర, రాజస్థాన్, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తమిళనాడు తదితర రాష్ట్రాల ప్రజలు ఎన్యూమరేషన్ ఫారాలు తీసుకుని వెనక్కి ఇవ్వడం లేదు. ఈ కారణంతో గరిష్ఠంగా హైదరాబాద్‌లోని పలు నియోజకవర్గాల్లో భారీగా ఓట్లు రద్దు కేటగిరీలో చేరనున్నాయి. దాదాపు అన్ని నియోజకవర్గాల్లోనూ ఇదే పరిస్థితి నెలకొని ఉంది. పత్రాలు తిరిగివ్వడం లేదు ఎన్యూమరేషన్ పత్రాలను తీసుకున్న వారు చాలా మంది వాటిని తిరిగి బీఎల్వోలకు ఇవ్వట్లేదు. ఆగస్టు 3 వరకు గడువుందని చాలా మంది ఇంకా నిర్లక్ష్యంగా ఉంటున్నారు. అయితే చివరి తేదీన సర్వర్ సమస్యలు తలెత్తుతాయనే ఉద్దేశంతో ఉద్యోగులు ఎన్యూమరేషన్ ఫారాల డిజిటలైజేషన్‌లో వేగం పెంచారు. ఎన్యూమరేషన్ పత్రాలను ఇవ్వని వారి ఓట్లు కూడా ఏఎస్‌డీ జాబితాలోకి వెళ్తున్నాయనే ఆందోళన ప్రస్తుతం వ్యక్తమవుతోంది. అంబర్‌పేటలో అత్యల్పం హైదరాబాద్ జిల్లా పరిధిలోని అంబర్‌పేటలో ఎన్యూమరేషన్ పత్రాల డిజిటలీకరణ ఇప్పటికే 50 శాతం పూర్తి అయింది. అయితే రద్దు కేటగిరీ ఓట్లు అంబర్‌పేటలో 3 శాతం, కంటోన్మెంట్‌లో 20 శాతంగా ఉండటం గమనార్హం. బీఎల్‌వోల నిర్లక్ష్యమూ ఓటరు జాబితా సవరణలో పలు నియోజకవర్గాల్లో అధికారులూ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ఎన్యూమరేషన్ పత్రాల పంపిణీ స్వీకరణ, డిజిటలీకరణలో సక్రమంగా విధులు నిర్వర్తించడం లేదు. దీంతో ఇప్పటి వరకు క్యూర్ పరిధిలోని నియోజకవర్గాల్లో 20 శాతం ఓట్లు ఏఎస్‌డీలోకి వెళ్లాయని, మరో వారం రోజుల్లో 40 శాతానికి మించుతుందని స్థానిక యంత్రాంగం అంచనా వేస్తోంది. ఏఎస్‌డీ జాబితాలోకి ఎన్యూమరేషన్ పత్రాలను తిరిగివ్వని వారితో పాటు ఇల్లు మారిన, మృతి చెందిన (ఏఎస్‌డీ), నియోజకవర్గం మారిన, ఓటర్ల వివరాలను జాబితా నుంచి తీసేస్తారు. అందులో ఎలాంటి సందేహం లేదని హైదరాబాద్ జిల్లా ఎన్నికల అధికారి, జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆర్వీ



కర్ణన్ జీహెచ్‌ఎంసీ స్పష్టం చేస్తోంది.హైదరాబాద్ జిల్లాలో మొత్తం ఓట్లు - 47,36,669 ఇప్పటివరకు డిజిటలైజేషన్ పూర్తయినవి - 24,67,704 వాటిలో రద్దు కేటగిరీలో చేరినవి - 4,35,501 (9.19 శాతం) ఎన్యూమరేషన్ ఫారాల్లో వివరాలు నింపేందుకు ఓటర్లకు ఏవైనా సమస్యలున్నట్లయితే కేవలం మూడో కాలమ్‌లో పేరు, ప్రస్తుత అడ్రస్‌ను రాసి ఇవ్వాలని బూత్ లెవల్ అధికారులు (బీఎల్‌వో) చెబుతున్నారు. తర్వాత నోటీసుకు ఏదైనా అధికారిక ధ్రువీకరణ పత్రం ద్వారా ఓటు హక్కును ఇక్కడే ఉంచుకునే అవకాశం ఉంటుందని సూచిస్తున్నారు. వివరాలను నింపలేక ఎన్యూమరేషన్ ఫారాన్ని ఇంట్లోనే ఉంచుకుంటే మాత్రం ఓటు కచ్చితంగా రద్దవుతుందనే విషయాన్ని అధికారులు పదే పదే గుర్తుచేస్తున్నారు. ఓటరు నమోదు పత్రాలు నింపేందుకు జీహెచ్‌ఎంసీ కేంద్ర కార్యాలయంతో పాటు సర్కిల్ ఆఫీసుల్లో హెల్ప్‌లైన్ సెంటర్లు విస్తృతంగా పని చేస్తున్నాయి.

# అదే నేను చేసిన తప్పు హైకోర్టు ఉత్తర్వులపై స్పందించిన హైడ్రా కమిషనర్

**హైడ్రా కమిషనర్ గా రంగనాథ్ ను తప్పించాలని హైకోర్టు ఆదేశం**

**ఈ నేపథ్యంలో స్పందించిన రంగనాథ్**

**ఎదుర్కొంటానని వెల్లడి**

**రాజ్యాంగ స్ఫూర్తితో పనిచేస్తానని హైడ్రా కమిషనర్ స్పష్టం**



తనపై ఉన్న 63 కోర్టు ధిక్కరణ కేసులు బడా భూ కబ్జాదారులు వేసినవేనని హైడ్రా కమిషనర్ రంగనాథ్ పేర్కొన్నారు. సామాన్యుల ప్లాట్లను, ప్రభుత్వ భూములను ఆక్రమించాలని చూస్తున్న బడా భూకబ్జాదారులను అడ్డుకుంటున్నందుకే తనపై కోర్టు ధిక్కరణ కేసులు వేశారని, రాజ్యాంగ స్ఫూర్తితో పని చేస్తూ, ప్రభుత్వం తనకు ఎలాంటి బాధ్యతలు అప్పగించినా వంద శాతం ఫలితాలు ఇవ్వడానికి కృషి చేస్తానన్నారు. తనను హైడ్రా కమిషనర్? పదవి నుంచి తప్పించాలంటూ న్యాయస్థానం ఆదేశాలు జారీ చేసిన నేపథ్యంలో రంగనాథ్ సోమవారం సాయంత్రం ఒక ప్రకటన విడుదల చేశారు. అందులో ఆయన పేర్కొన్న అంశాల ఇలా ఉన్నాయి. న్యాయస్థానాలను తప్పుదోవ పట్టిస్తున్నారు రెండేళ్ల కాలంలో హైడ్రా కమిషనర్‌గా రాజ్యాంగ స్ఫూర్తిని అనుసరించి, రాజ్యాంగంలోని ఆర్టికల్ 21, 48ఏ ప్రకారం పనిచేస్తున్నట్లు రంగనాథ్ చెప్పుకొచ్చారు. ఈ క్రమంలో మార్కెట్ విలువ ప్రకారం రూ.1.5 లక్షల కోట్ల విలువైన ప్రభుత్వ ఆస్తులు, చెరువులు, పార్కులను రక్షించినట్లు తెలిపారు. ఆరు చెరువులను పూర్తిస్థాయిలో పునరుద్ధరించామని, మరో 20 చెరువుల పునరుద్ధరణ పనులు ప్రస్తుతం జరుగుతున్నాయని అన్నారు. బడాబాబులు, ల్యాండ్‌మాఫియాలు ఆక్రమించిన వందల చెరువులు, వేల ఎకరాల సర్కారు భూములు, పార్కులు హైడ్రా వెనక్కి తెచ్చి రాష్ట్ర ప్రభుత్వానికి అప్పగించిందన్నారు. భూమాఫియా, భూకబ్జాదారులు తప్పుడు సమాచారంతో న్యాయస్థానాలను తప్పుదోవ పట్టిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సేవ్ ద రాక్ సొసైటీ ఫిర్యాదుతోనే అక్కడికి హైడ్రా : మల్కాజిగిరి మండలంలోని లోతుకుంట భూమి విషయంలో దాదాపు రూ.10 వేల కోట్ల విలువైన భూమిని శాంతా శ్రీరాం అనే రియల్ ఎస్టేట్‌కంపెనీ కొట్టేయాలని చూసిందన్న ఏవీ రంగనాథ్ అనుమతులు లేకుండా ఎన్నో ఏళ్లనాటి వారసత్వ గుట్టలను పేల్చివేస్తూ, వందల చెట్లను ధ్వంసం చేసిందని మండిపడ్డారు. సేవ్ ద రాక్ సొసైటీ, పర్యావరణవేత్తలతో పాటు స్థానికులు ఇచ్చిన ఫిర్యాదుల ఆధారంగా హైడ్రా అక్కడ రంగంలోకి దిగిందన్నారు. ఎక్కడో మూడు కిలోమీటర్ల దూరంలో ఉండాల్సిన భూమిని ఇక్కడ ఉన్నట్లు చూపిస్తూ ఈ శాంత శ్రీరాం సంస్థ 120 ఎకరాల ప్రభుత్వ భూమిలోకి ప్రవేశించి, ఆక్రమించి, అడ్డుకున్నందుకు తనపై కోర్టు ధిక్కరణ కేసు వేసిందని తెలిపారు. సంచలన ఆరోపణలు చేసిన రంగనాథ్ అంబర్ పేటలోని బతుకమ్మ కుంట చెరువును మింగేయాలని చూసింది ఒకరైతే లోతుకుంటలో రూ.వేల కోట్ల విలువైన ప్రభుత్వ భూమిని కొట్టేయాలని చూసింది ఇంకొకరని రంగనాథ్ ప్రకటనలో పేర్కొన్నారు. సామాన్యుల ప్లాట్లు కొట్టేసి, బడా కాంప్లెక్సులు నిర్మించాలని చూసింది మరొకరైతే, వేల సంఖ్యలో ఉన్న సింగరేణి కార్మికుల ప్లాట్లు కాజేయాలని చూసింది వేరొకరని ఆయన పలు సంచలన ఆరోపణలు చేశారు. మాఫియాగా చలామణి అవుతూ రూ.వేల కోట్ల విలువైన సామాన్యుల ప్లాట్లు, ప్రభుత్వ భూములు ఆక్రమించింది ఇంకొకరని మండిపడ్డారు. వీరందరికీ హైడ్రా కమిషనర్‌గా తను అడ్డుపడటమే చేసిన తప్పు అని ఆవేదన వ్యక్తం చేశారు. తనపై ఉన్న 63 ధిక్కరణ కేసులు వీళ్లు వేసినవేనని చెప్పారు. వాటిని తాను చట్టబద్ధంగానే ఎదుర్కొంటానని, న్యాయస్థానాలపై పూర్తి నమ్మకం ఉందని పేర్కొన్నారు.

# తెలంగాణలో కొత్తగా ఫ్యామిలీ రిజిస్టర్ సర్టిఫికెట్

**ఇది ఉన్నవారికే ప్రభుత్వ సంక్షేమ పథకాలు**

**ఫ్యామిలీ రిజిస్టర్ తయారు చేయాలని ప్రభుత్వ నిర్ణయం**

**రేషన్ కార్డుల్లోని డేటా ఆధారంగా కుటుంబ రిజిస్టర్**

**మీ సేవ ద్వారా ఫ్యామిలీ రిజిస్టర్ సర్టిఫికెట్ తీసుకునే అవకాశం**




ఫ్యామిలీ రిజిస్టర్ తయారు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. రేషన్ కార్డుల్లోని డేటా ఆధారంగా కుటుంబ రిజిస్టర్ సిద్ధం చేయనుంది. ప్రజలకు అవసరమైనప్పుడు మీ సేవ ద్వారా ఫ్యామిలీ రిజిస్టర్ సర్టిఫికెట్ ఇవ్వనున్నారు. ఫ్యామిలీ రిజిస్టర్ సర్టిఫికెట్ కేవలం కుటుంబ సభ్యుల వివరాల కోసమేనని, ఆస్తులపై హక్కులకు, లీగల్ హెయర్ నిర్ధారణకు ఉపయోగపడదని ప్రభుత్వం స్పష్టం చేసింది. రాష్ట్రంలో కుటుంబ రిజిస్టర్ రానుంది. ప్రభుత్వ పథకాలు, ఇతర అవసరాల కోసం కుటుంబ వివరాల ధ్రువీకరణకు ఇప్పటి వరకు సరైన రికార్డులు లేవు. లబ్ధిదారుల కుటుంబ సభ్యుల వివరాల కోసం వారు చెప్పిందే నమ్మాల్సి వస్తోంది. ప్రజలు తమ కుటుంబ సభ్యుల వివరాలతో అధికారిక సర్టిఫికెట్ పొందే అవకాశం లేదు. ఇలాంటి సమస్యలకు చెక్ పెట్టేందుకు అధికారికంగా ఫ్యామిలీ రిజిస్టర్ తయారు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. భవిష్యత్తులో ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలులో ఫ్యామిలీ రిజిస్టర్ కీలకంగా మారే అవకాశం ఉంది. ఉత్తరప్రదేశ్, హర్యానా, కర్ణాటక, ఉత్తరాఖండ్, తమిళనాడు, రాజస్థాన్ రాష్ట్రాలు వివిధ పేర్లతో రాష్ట్ర స్థాయి కుటుంబాల డేటా బేస్ నిర్వహిస్తున్నాయి. కుటుంబ రిజిస్టర్ నిర్వహణ, ప్రజలకు సర్టిఫికెట్ ఇచ్చే బాధ్యతను సర్కార్ రెవెన్యూ శాఖకు అప్పగించింది. ఫ్యామిలీ రిజిస్టర్, సర్టిఫికెట్ల విధి విధానాలపై రెవెన్యూ శాఖ కార్యదర్శి లోకేశ్ కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. తెలంగాణలో కొత్తగా ఫ్యామిలీ రిజిస్టర్ సర్టిఫికెట్ ఇది ఉన్నవారికే ప్రభుత్వ సంక్షేమ పథకాలు మీ-సేవ ద్వారా కుటుంబ రిజిస్టర్ సర్టిఫికెట్ ఫ్యామిలీ రిజిస్టర్ సర్టిఫికెట్ కోసం రేషన్‌కార్డుల్లోని డేటాను ప్రామాణికంగా తీసుకోనున్నారు. పౌర సరఫరాల శాఖ డేటాను రెవెన్యూ శాఖ తీసుకోనుంది. కుటుంబ రిజిస్టర్ డిజిటల్ రూపంలో ఉంటుంది. ప్రతీ ఫ్యామిలీకి గుర్తింపు కార్డు ఇస్తారు. రేషన్ కార్డు నంబరునే ఫ్యామిలీ రిజిస్టర్ ఐడెంటిఫికేషన్ నంబర్ గా ఇవ్వాలని నిర్ణయించారు. రిజిస్టర్‌లో ప్రతి కుటుంబానికి రిజిస్టర్ ఐడెంటిఫికేషన్ నెంబరు, కుటుంబ యజమాని, కుటుంబ సభ్యులందరి పేర్లు, వయసు, కుటుంబ పెద్దతో బంధుత్వం, ఆధార్ నంబరు, అడ్రస్ ఉంటాయి. ప్రజలకు అవసరమైనప్పుడు మీ-సేవ ద్వారా కుటుంబ రిజిస్టర్ సర్టిఫికెట్ ఇస్తారు. మీ సేవలో రెవెన్యూ సర్వీసుల విభాగంలో ఫ్యామిలీ రిజిస్టర్ సర్టిఫికెట్ అనే కొత్త సర్వీసు రానుంది. డేటా ఫ్యామిలీ రిజిస్టర్‌కు అనుసంధానం మీ సేవ కేంద్రాలు, యాప్, వాట్సప్ ద్వారా నిర్ణీత ఫీజు చెల్లించి సర్టిఫికెట్ కోసం దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. దరఖాస్తు చేసిన రెండు రోజుల్లో సంబంధిత మండల తహసీల్దార్ రేషన్ కార్డు డేటా ఆధారంగా డిజిటల్ సంతకంతో మీ సేవ ద్వారా సర్టిఫికెట్ జారీ చేస్తారు. ఫ్యామిలీ రిజిస్టర్ సర్టిఫికెట్ కుటుంబ సభ్యుల వివరాల కోసమేనని ఆస్తులపై హక్కులు, లీగల్ హెయర్ నిర్ధరణకు ఉపయోగపడదని ప్రభుత్వం స్పష్టం చేసింది. కుటుంబ రిజిస్టర్‌లో నమోదైన వివరాలన్నీ సర్టిఫికెట్‌లో ఇస్తారు. పౌర సరఫరాల శాఖ డేటాను ఫ్యామిలీ రిజిస్టర్‌కు అనుసంధానం చేయడంతో పాటు మీ సేవ ద్వారా సర్టిఫికెట్ జారీ చేసేందుకు అసరమైన సాఫ్ట్‌వేర్‌ను సిద్ధం చేయాలని ఎలక్ట్రానిక్ సేవల డెలివరీ విభాగాన్ని ప్రభుత్వం ఆదేశించింది. అవసరమైన వివరాలను ఈఎస్‌డీ విభాగానికి ఇవ్వాలని పౌర సరఫరాల శాఖకు స్పష్టం చేసింది. ఫ్యామిలీ రిజిస్టర్, సర్టిఫికెట్లపై తహసీల్దార్లు, ఇతర రెవెన్యూ అధికారులకు సమాచారం ఇవ్వాలని కలెక్టర్లను రెవెన్యూ శాఖ కార్యదర్శి ఆదేశించారు.ఆ 12 ధ్రువపత్రాల్లో ఫ్యామిలీ రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ మీసేవ ద్వారా ఫ్యామిలీ రిజిస్ట్రేషన్ ధ్రువపత్రాలు ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించడాన్ని మజ్లిస్ అధ్యక్షుడు అసదుద్దీన్ ఒవైసీ స్వాగతించారు. సర్ కోసం నిర్దేశించిన 12 ధ్రువపత్రాల్లో ఫ్యామిలీ రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ ఒకటి అని గుర్తు చేశారు. సర్‌లో నోటీసులు అందుకునే చాలా మంది పేదలకు ఇది ఉపయోగపడుతుందని అసదుద్దీన్ అభిప్రాయపడ్డారు.

PRINTED AND PUBLISHED BY V.NARSINGAM, ON BEHALF OF CH.V. PRABHAKAR RAO AND PRINTED AT SRI S HARADHA OFFSET PRINTERS. H.NO.9-14/8/3, BUGGARAM VILLAGE AND MANDAL, BUGGARAM GRAMAPANCHAYATH- 505454, JAGTIAL DISTRICT, TELANGANA STATE.. PUBLISHED AT 6-6-206,PADMA NAGAR, JAGTIAL - 505327, JAGTIAL DISTRICT, TELANGANA STATE. EDITOR : CH V. PRABHAKAR RAO, RNI . TELTEL/2021/81092 : PHONE : 9391533339 EMAIL: prajamantalu@gmail.com